ప్రజాశక్తి
బుధవారం 3 జనవరి 2024
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

రెవెన్యూ 'రాజకీయం'.. భూములు మాయం



గంభీరంలో కబ్జాదారుల కన్నుపడిన స్థలం

◆ గంభీరం, గండిగుండంలో ఆక్రమణలపర్వం
◆ కబ్జారాయుళ్ల చేతుల్లో రూ.కోట్ల విలువైన స్థలాలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

జిల్లాలోని ఆనందపురం మండలంలోని పలు గ్రామాల్లో సామాన్యుల హక్కుభుక్తంగా ఉన్న భూములు కబ్జారాయుళ్ల గుప్పెట్లోకి వెళ్లిపోతున్నాయి. రూ.కోట్లు విలువైన భూములను అటు రాజకీయ నాయకులు, ఇటు రెవెన్యూలోని కొంతమంది అధికారులు కలసి కొల్లగొడుతున్నారు. దీంతో పేద, సన్న చిన్నకార రైతుల కుటుంబాలకు చెందిన వారు అనాథలై ఏ దిక్కూ లేక లబోదిబోమంటున్నారు. మండలంలోని గంభీరం గ్రామంలో సర్వే నెంబరు 175/2లో కుంచం అప్పలకొండకు 57 సెంట్లు సాగు భూమి ఉండేది. ప్రస్తుతం అప్పలకొండ కుటుంబమే ఈ భూమి సాగు చేసుకుంటూ జీవనాన్ని సాగిస్తోంది. అప్పలకొండను కాదని డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసరావు కనీస ఆధారాలేవీ లేకున్నా సరే వేరే వ్యక్తులకు దీన్ని బదిలీ చేసే యత్నాల్లో నిమ్నగమయ్యారన్నది తెలుస్తోంది. ఆన్‌లైన్ ప్రక్రియ చేయలేనందున అసలు హక్కుదారు అయిన అప్పలకొండను పక్కనపెట్టే చర్యలకు డిప్యూటీ తహశీల్దార్ సిద్ధపడడం వెనక అనేక ఒత్తిళ్లు ఉన్నాయని గ్రామంలో పలువురు ఆరోపిస్తున్నారు. జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించి తమ గోడును చెప్పుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఈ 57 సెంట్ల భూమిని పలువురు నకిలీ వ్యక్తులకు కట్టబెట్టే దిశగా భూ ట్యాంపరింగ్ అయిపోయిందని, ఉన్నతాధికారి వారికి కొమ్ముకాస్తున్నారని స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గండిగుండంలోనూ బెదిరింపుల పర్వం

ఇదే మండలంలోని గండిగుండం గ్రామంలో సర్వే నెంబరు 235/8 235/పి, 235/1లోగల 50 సెంట్ల భూమి దళాయి సింహాచలం నుంచి వారసత్వంగా దళాయి అప్పారావుకు వీలునామా ద్వారా సంక్రమించగా ఈ భూమికి ఆన్‌లైన్, భూ సర్వే చేస్తామంటూ స్థానిక అధికార పార్టీకి చెందిన వ్యక్తి భూహక్కుదారులను సంప్రదించినట్టే సంప్రదించి ఆ భూమిపై హక్కు కావాలంటే 50:50 వాటా కావాలని అధికార పార్టీ నేతలు బెదిరింపులకు దిగిన సన్నివేశం తాజాగా నడుస్తోంది. ఈ ఒప్పందానికి సదరు భూ హక్కుదారు అంగీకరించకపోవడంతో 'నీకేంటి సంబంధం ఈ భూమి' అంటూ వైసిపికి చెందిన వ్యక్తులు దౌర్జన్యానికి పాల్పడిన ఘటన వెలుగులోకి మిగతా 2లో..



స్థానికులతో కలిసి నినాదాలు చేస్తున్న లోకనాథం

హైడ్రో పవర్ ప్లాంట్ పనులు ఆపేయాలి

సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం

ప్రజాశక్తి - దేవరాపల్లి : దేవరాపల్లి మండలం చింతలపూడి పంచాయతీలోని బలిపురం సమీపం నుంచి వీలుపర్తి పంచాయతీ మారికకొండ వరకు అదానీ కంపెనీ తలపెట్టిన హైడ్రో పవర్ ప్లాంట్ నిర్మాణ నిమిత్తం మట్టి నమూనా పరీక్షల కోసం తవ్వకాలు చేపడుతున్న ప్రాంతాలను మంగళవారం సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం పరిశీలించారు. ఆయన వెంట రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయనబాబు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న, మండల కార్యదర్శి బిటి.దొర, స్థానిక గిరిజన ప్రజలు ఉన్నారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ గిరిజనులకు, రైతులకు తీవ్ర నష్టం చేకూర్చే హైడ్రో వపర్ ప్లాంట్ నిర్మాణం తగదని, తక్షణమే పనులు ఆపేయాలని డిమాండ్ చేశారు. హైడ్రో పవర్ ప్లాంట్ పనులు కోసం అదానీ కంపెనీ పర్యవేక్షణలో కొల్‌కతాకు చెందిన కంపెనీ మట్టి నమూనా పరీక్షలు చేయడానికి భూ తవ్వకాలు చేపడుతోందన్నారు. ఈ మట్టి నమూనా తవ్వకాలు చట్ట వ్యతిరేకమైనవన్నారు. గ్రామ సభలు జరపకుండా, ప్రజల ఆమోదం లేకుండా మోసపూరితంగా అదానీ కంపెనీ ఈ తవ్వకాలు జరపడాన్ని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. హైడ్రో పవర్ ప్రాజెక్టు పనులు ప్రారంభమైతే చింతలపూడి పంచాయతీలోని 9 గ్రామాలు, తామరబ్బ పంచాయతీలో 7 గ్రామాలతో పాటు లక్షలాది వ్యవసాయ భూములు పూర్తిగా ముంపునకు గురవుతారన్నారు. శారదా మిగతా 2లో..

గ్యాంగ్ రేప్‌లో 13 మందిపై పోక్సో కేసు

▶ వార్త 3లో..

సైన్స్ అండ్ టెక్నాలజీ మ్యూజియానికి శంకుస్థాపన

▶ వార్త 3లో..

మోడీ విధానాలు కరోనా కంటే ప్రమాదకరం

▶ వార్త 2లో..

ఊహించిందే..!

◆ అమర్, బాబూరావు స్థానంలో కొత్త సమన్వయకర్తలు
◆ అనకాపల్లికి భరత్ కుమార్
◆ పాయకరావుపేటకు రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు



భరత్ కుమార్



జోగులు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో అనుకున్నట్లే రెండు నియోజకవర్గాల్లో సమన్వయకర్తలను వైసిపి మార్చింది. అయితే ఎవరూ ఊహించని రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులును పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించింది. ఎమ్మెల్యే గొల్ల బాబూరావుకు ఈసారి టిక్కెట్ ఇవ్వని విషయం స్పష్టంగా తేలిపోవడంతో కొంతమంది ఎవరి ప్రయత్నాలు వారు టిక్కెట్ కోసం ప్రారంభించారు. అనూహ్యంగా ఆ పార్టీ జోగులును తెరమీదకు తెచ్చింది. వైసిపి అధ్యక్షులు జగన్మోహన్‌రెడ్డి ఆదేశాలతో పార్టీ కేంద్ర కార్యాలయం రెండు నియోజకవర్గ సమన్వయకర్తలను ప్రకటించింది. కొద్ది రోజుల క్రితం ఎమ్మెల్యే బాబూరావును పిలిచి వచ్చే ఎన్నికల్లో కొత్త మిగతా 2లో..

టౌన్ కొత్త రోడ్డులో వాహనాలను ప్రైవేటు వ్యక్తులతో బయటకు తీసుకొస్తుండగా అడ్డుకుంటున్న కార్మికులు



మున్సిపల్ సమ్మె ఉద్రిక్తం

విశాఖలో 500 మంది అరెస్టు

▶ వార్తలు 4లో..

కార్మికులను అరెస్టు చేస్తున్న పోలీసులు





మొదటి పేజీ తరువాయి..

రెవెన్యూ 'రాజకీయం'.. భూములు మాయం

వచ్చింది. ఆ భూమిలో అప్పటికే ఉన్న బిల్డింగ్ మెటీరియల్, ఇతర సామగ్రిని వైసిపి వ్యక్తులు ధ్వంసం చేశారని అప్పారావు స్థానిక తహశీల్దార్ కార్యాలయానికి ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదు. ముగ్గురు మహిళలను ఈ భూమిపైకి తీసుకొచ్చి వారికి దఖలు పరిచేందుకు గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు పంచాయితీలు ఇప్పటికే ప్రారంభించాడు. కొంత డబ్బు ఇస్తాం భూమి మొత్తం వదిలేయాలని పేదలైన దళాయి కుటుంబంపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. ఈ 50 సెంట్ల భూమితో ఎలాంటి హక్కూ లేని పైడమ్మ, ఈశ్వరమ్మ, భవాని వంటి పేర్లతో ఈ భూమిని ఆన్‌లైన్‌లో చేసెయ్యాలంటూ స్థానిక పెత్తందారు రెవెన్యూపై ఒత్తిడి తేవడం ఇక్కడ కొనసాగుతోంది. జిల్లా రెవెన్యూ ఉన్నతాధికారులు కలుగజేసుకుని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, రెవెన్యూ ఉన్నతాధికారుల తీరుపై విచారణ జరిపించాలని పై రెండు గ్రామాలకు చెందిన బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

హైడ్రో పవర్ ప్లాంట్ పనులు ఆపేయాలి

నది ద్వారానే రైవాడ ఆయకట్టుకు నీరు వస్తుందని, హైడ్రో ప్రాజెక్టు వల్ల నీటి వనరులు ఆయకట్టుకు రాకుండా మొత్తం ఆగిపోయే ప్రమాదముందని అన్నారు. దీనికి సంబంధించి ఇఐఎ రిపోర్టును నేటికీ బహిర్గతం చేయలేదని తెలిపారు. రైవాడకు నీరురాకపోతే ఆయకట్టుపై ఆధారపడిన సుమారు 20 వేల ఎకరాలకు సాగు నీరు అందదన్నారు. విశాఖ నగర ప్రజలకు తాగునీరు సరఫరా చేసే అవకాశం భవిష్యత్‌లో ఉండదని తెలిపారు. ఇంత ప్రమాదం వున్న ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం ఎలా అనుమతులు ఇచ్చిందని ప్రశ్నించారు. ఒకవైపున గిరిజనులకు, రైతులకు, విశాఖ నగారానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందే అనుమానాలు అనేకం ఉన్నాయని తెలిపారు. వెంటనే హైడ్రో ప్రాజెక్టు పనులు నిలుపుదలకు స్థానిక ఉపముఖ్యమంత్రి జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. రైవాడ జలాశయానికి ఎదురయ్యే ముప్పు గురించి సాక్షత్తు రాష్ట్ర జలవనరులశాఖే సవివరమైన నివేదిక ఇచ్చిందని, వాటన్నింటినీ తుంగలోకి తొక్కి అదానీ ప్రయోజనాల కోసం పాటుపడడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పర్యావరణానికి ప్రమాదం వచ్చే ఏ కంపెనీలకూ అనుమతులు ఇవ్వరాదని న్యాయ స్థానాలు హెచ్చరిస్తున్నా, అదానీ కంపెనీ పట్ల రాష్ట్ర ప్రభుత్వం ఉదాసీనంగా ఉండటం హేయమన్నారు. ఇప్పటికైనా వెంటనే మట్టి నమూనా పరీక్షల యంత్రాలను ఆ ప్రాంతాల నుండి తొలగించాలని, లేనిపక్షంలో ప్రజాగ్రహానికి గురికావల్సి వస్తుందని హెచ్చరించారు.

ఊహించిందే..!

వారికి టిక్కెట్ ఇస్తామని, విజయానికి పనిచేయాలని సూచించారు. రాజ్యసభ టిక్కెట్ ఇస్తామని బాబూరావుకు ఆశచూపారు. రాజ్యసభ సభ్యుని పదవి వస్తుందో, లేదో తెలీదుగానీ ఎమ్మెల్యే టిక్కెట్ మాత్రం రాదన్న విషయం మంగళవారం రాత్రి ప్రకటించిన సమన్వయకర్తల జాబితాతో అర్థమైంది. ముందునుంచీ అనుకున్నట్లుగానే అనకాపల్లి టిక్కెట్ వచ్చే ఎన్నికల్లో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు ఇవ్వరని ప్రచారం జరుగుతోంది. ఎక్కడ నుంచి పోటీచేయాలన్న స్పష్టత ఇవ్వకుండానే అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్తను మార్చేశారు. అమర్‌కు పార్టీలో ప్రాధాన్యత తగ్గుతుందన్నట్లు జరుగుతున్న ప్రచారానికి సమన్వయకర్తల మార్పుతో బలం చేకూరినట్లైంది. అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్తగా మలసాల భరత్‌కుమార్‌ను నియమించింది. కొంతకాలంగా భరత్ కుమార్‌ను వైసిపి రంగంలోకి దించనుందని ప్రచారం సాగుతోంది. అమర్ బదులు భరత్‌ను బరిలోకి దించుతుందని సంకేతాలు కొంతకాలం క్రితమే ఇచ్చింది. అనకాపల్లి టిక్కెట్ దాడి రత్నాకర్‌కు రాదని తెలుసుకున్న పార్టీ సీనియర్ నాయకులు దాడి వీరభద్రరావు వైసిపికి మంగళవారం రాజీనామా చేశారు. అమర్‌కు టిక్కెట్ ఇవ్వకపోతే తన తనయుడు రత్నాకర్‌ను పోటీ చేయించాలని వీరభద్రరావు ఆశించారు. మంగళవారం సమన్వయకర్తలను ప్రకటించడానికి కొన్ని గంటల ముందు వైసిపి పదవులు, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసి టిడిపిలో చేరనున్నట్లు దాడి ప్రకటించారు.

ఉరితాళ్లతో సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సమ్మెలో భాగంగా జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఎపి సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 14వ రోజైన మంగళవారం దీక్షలు నిర్వహించారు. మెడకు ఉరితాళ్లు బిగించి నిరసన తెలిపారు.



విశాఖలో ఉరితాళ్లతో సమగ్ర శిక్ష ఉద్యోగులు

సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే తమకు చావే గతి అని నినదించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు పి.పుండరీకాక్ష, కార్యదర్శి ఎల్.చైతన్య తదితరులు పాల్గొన్నారు. పశ్చిమ టిడిపి ఎమ్మెల్యే పి.గణబాబు దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు.

అనకాపల్లి : అనకాపల్లి జిల్లా విద్యాశాఖ కార్యాలయం వద్ద సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరవధిక సమ్మె మంగళవారం నాటికి 14వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా రాష్ట్ర జేపీసీ పిలుపు మేరకు ఉద్యోగులు మెడకు ఉరితాళ్లు వేసుకుని నిరసన తెలిపారు. జగన్ మోహనరెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు రెగ్యులర్ చెయ్యాలని, కనీసం హెచ్‌ఆర్ పాలసీ అయినా ఇంప్లిమెంట్ చేయాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణం గా జీతాలు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేపీసీ సభ్యులు తట్ట కృష్ణ, అచ్యుత కృష్ణ, వెంకటరావు, రామ చంద్రరావు, విజయ్, నూకేష్, సతీష్ పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

మోడీ విధానాలు కరోనా కంటే ప్రమాదకరం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : నరేంద్ర మోడీ విధానాలు కరోనా కంటే ప్రమాదకరమైనవని సిఐటియు జగదాంబ జోన్ కార్యదర్శి కెవిపి చంద్రమౌళి అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ, జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక, ప్రజాసంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు మంగళవారం నాటికి 1006 రోజులకు చేరాయి. దీక్షలో పాల్గొన్న సిఐటియు నాయకులు పిపిఇ కిట్స్ ధరించి వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా వచ్చి లక్షలాది ప్రాణాలు తీసిందని గుర్తుచేశారు. మోడీ ప్రైవేటీకరణ విధానాలు దేశానికి మరింత ప్రమాదకరమన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను జిందాల్‌కు అప్పజెప్పే ప్రయత్నం జరుగుతోందని, ఆ కంపెనీని ఎట్టిపరిస్థితుల్లోనూ అడుగుపెట్టనిచ్చేది లేదని అన్నారు.

సిఐటియు సీనియర్ నాయకులు వై.రాజు మాట్లాడుతూ ప్రభుత్వ రంగం మాత్రమే ప్రజలకు సేవ చేస్తుందన్నారు. ప్రభుత్వానికి అన్ని రకాల పన్నులూ ప్రభుత్వ రంగమే చెల్లిస్తుందన్నారు. స్టీల్‌ప్లాంట్, కెజిహెచ్ ఎన్నో సేవలు కరోనాకాలంలో అందించాయని, అటువంటి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయడం దుర్మార్గమని అన్నారు. కార్యక్రమంలో తిలక్, శ్రీను, ఎర్రి బాబు, ప్రకాష్, కె.నర్సింగరావు, కె.సంతోష్ కుమార్, టి.కామేశ్వరరావు పాల్గొన్నారు.



వినూత్నంగా నిరసన తెలుపుతున్న నాయకులు

గ్యాంగ్‌రేప్ నిందితులను కఠినంగా శిక్షించాలి



మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి ప్రియాంక

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఒడిశాకు చెందిన మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా విశాఖ కమిటీ డిమాండ్ చేసింది. మంగళవారం జరిగిన కమిటీ సమావేశంలో సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి డాక్టర్ జి.ప్రియాంక, జిల్లా అధ్యక్షురాలు బి.పద్మ మాట్లాడుతూ విశాఖపట్నంలో మహిళలపై హింస రోజురోజుకూ పెరగడంపై ఆందోళన వ్యక్తం చేశారు. స్త్రీలకు రక్షణ లేని నగరంగా విశాఖ మారిపోయిందన్నారు. ఒక పక్క మద్యం, మరో పక్క మాదక ద్రవ్యాలు ఏరులై పారుతూ నగరాన్ని మత్తు నగరంగా మార్చేశాయని తెలిపారు. దీంతో మహిళల పట్ల హింస అడ్డూఅదుపూ లేకుండా పోయిందని అన్నారు. వీటిని నియంత్రించటంలో ప్రభుత్వం విఫలమైందని తెలిపారు. తాజా గ్యాంగ్‌రేప్ కేసులో నిర్భయ చట్టం ప్రకారం నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. బాధిత యువతికి నిర్భయ నిధి నుండి ఆర్థిక సహాయాన్ని ఇవ్వాలని, మానసికంగా నిలదొక్కుకునేలా మానసిక వైద్యులతో వైద్యం ఇప్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆర్.విమల, ఆర్.వరలక్ష్మి, కె.మణి, భారతి, సుజాత, వి.ప్రభావతి, కె.అనురాధ, ఎ.పుష్పాంజలి, సంతోషం తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు తీవ్ర నిర్లక్ష్యం

నగరంలో చోటు చేసుకున్న బాలిక గ్యాంగ్ రేప్ కేసులో పోలీసుల నిర్లక్ష్యం ఉందని మహిళా చేతన ప్రధాన కార్యదర్శి కె.పద్మ విమర్శించారు. బాలికపై సామూహిక అత్యాచార సంఘటనలో ముద్దాయిలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద మహిళా చేతన ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. నాయకులు డి.లలిత, న్యాయవాది జహర, భారత నాస్తిక సమాజం నాయకులు రాంప్రభు, విజ్ఞానంద్, ఎయు ఉద్యోగి సిహెచ్.మధు గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

రైటర్ కుమార్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సీనియర్ నాయకులు ఎం.ఈశ్వరరావుపై వన్ టౌన్ స్టేషన్ రైటర్ కుమార్ దౌర్జన్యానికి పాల్పడి, విచక్షణారహితంగా కొట్టడం దారుణమని కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వై.రాజు అన్నారు. కెవిపిఎస్ ఆధ్వర్యంలో మంగళవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద రైటర్ కుమార్ చర్యను ఖండిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ పోలీసుల అక్రమ అరెస్టులను ఖండించారు.

సైన్స్ అండ్ టెక్నాలజీ మ్యూజియానికి శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న మంత్రి అమర్‌నాథ్

ప్రజాశక్తి-ఆరిలోవ : కైలాసగిరిపై అడ్వాన్స్‌డ్ సైన్స్ అండ్ టెక్నాలజీ మ్యూజియం నిర్మాణానికి రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రూ.4.69 కోట్ల కేంద్ర నిధులు, రూ.93.80 లక్షలు సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ నిధులతో అత్యాధునికమైన మ్యూజియం నిర్మాణాన్ని కైలాసగిరిపై నిర్మించనున్నట్లు చెప్పారు. పర్యాటక ప్రాంతమైన విశాఖ నగరానికి ఈ మ్యూజియం తలమానికంగా నిలవబోతోందన్నారు. సంవత్సర కాలంలో మ్యూజియం నిర్మాణాన్ని పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఈ మ్యూజియంలో త్రీడీ ఆర్ట్ గ్యాలరీ, సిలికాన్ మ్యూజియం, సోలార్ స్పేస్ టెక్నాలజీకి సంబంధించిన అనేక అంశాలను పొందుపరచనున్నామని చెప్పారు. భవిష్యత్తులో అందుబాటులోకి రానున్న సాంకేతిక పరిజ్ఞానం గురించి విద్యార్థులకు, యువకులకు తెలియజేయాలన్న సంకల్పంతో ఈ మ్యూజియం నిర్మాణం చేపడుతున్నామని వివరించారు. విశాఖకు వచ్చే పర్యాటకులను మరింత ఆకర్షించేందుకు ఎంజిఎం పార్క్ దగ్గర సీ డెక్ ఏర్పాటు చేస్తున్నామని, ఇప్పటికే విశాఖ తీరంలోని ఐదు, ఆరు బీచ్లను సుందరీకరించామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, సైన్సు సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సిఇఒ డాక్టర్ కె.జయరామిరెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, విఎంఆర్‌డిఎ జాయింట్ కమిషనర్ రవీంద్ర, సెక్రటరీ డి.కీర్తి, స్థానిక కార్పొరేటర్ కోరుకొండ వెంకటరత్న స్వాతి తదితరులు పాల్గొన్నారు. మాజీ మంత్రి, వైసిపి నాయకులు దాడి వీరభద్రరావు పార్టీకి రాజీనామా చేసిన విషయంపై విలేకర్లు అడిగిన ప్రశ్నకు మంత్రి అమర్‌నాథ్ స్పందిస్తూ అయిష్టంతో పార్టీలో ఉంటూ వెన్నుపోటు పొడిచేకన్నా పార్టీని వీడడమే మంచిదని పేర్కొన్నారు.

డ్రగ్స్ అనర్థాలపై అవగాహన

ప్రజాశక్తి -తగరపువలస : మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే అనర్థాలపై భీమిలి మండలం దాకమర్రి రఘు ఇంజనీరింగ్ కళాశాలలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆధ్వర్యాన విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఎస్ఇబి అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఎం.వినీషా మాట్లాడుతూ, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల భవిష్యత్ నాశనమవుతుందని, సమాజంలో గౌరవం ఉండదని వివరించారు. మాదక ద్రవ్యాలు, అక్రమంగా ఇసుక రవాణా, నాటు సారా తయారీకి సంబందించి సమాచారం ఉంటే 14500 టోల్ ఫ్రీ నంబర్ కు తెలపాలని సూచించారు. ఫిర్యాదు ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

టోల్ ఫ్రీ నంబర్‌తో కూడిన ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఇబి డిటిఎఫ్ ఇన్‌స్పెక్టర్ కె.సురేష్, స్థానిక స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వి.రామకృష్ణ, ఎస్ఐలు డి.పద్మావతి, కె.అనిల్, సిబ్బంది, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జగదీష్ పండా, అధ్యాపకులు పాల్గొన్నారు

కఠోర శ్రమతో ఉత్తమ ఫలితాలు



సభలో మాట్లాడుతున్న జెడ్సీ బొడ్డేపల్లి రాము

ప్రజాశక్తి -తగరపువలస : కఠోర శ్రమ ద్వారానే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని జివిఎంసి ఒకటో జోన్ జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము విద్యార్థులకు సూచించారు. చిట్టివలస బొగ్గురోడ్డులోని శ్రీకృష్ణా డిగ్రీ కళాశాల విద్యార్థుల ఫేర్‌వెల్ ఫంక్షన్ స్థానిక ప్రయివేట్ ఫంక్షన్ హాల్లో మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జోనల్ కమిషనర్ రాము మాట్లాడుతూ, ఏ రంగంలో పనిచేసినా సరే నైపుణ్యం అవసరమని నొక్కి చెప్పారు. నేడున్న ప్రత్యేక పరిస్థితుల్లో సాంకేతికతను అందిపుచ్చుకోవడం అనివార్యం అన్నారు. కళాశాల చైర్మన్ బి.నరసింగరావు అధ్యక్షతన జరిగిన సభలో విశ్రాంత డిఎస్‌పి తమ్మినేని భాస్కరరావు, ప్రభుత్వ జూనియర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ ఈశ్వరరావు, ప్రముఖ వ్యాపారవేత్త కొప్పల కృష్ణ, ఉపాధ్యాయులు జి.సత్యనారాయణ, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. వివిధ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.


పింఛన్లు పంపిణీచేస్తున్న ముత్తంశెట్టి

గిడిజాలలో పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి-ఆనందపురం : పెంచిన పింఛన్లు రూ.3000ను మంగళవారం గిడిజాలలో భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ మల్లికార్జున పంపిణీచేశారు. మండలంలోని 26 పంచాయతీల నుంచి వచ్చిన పెన్షన్‌దారులకు జిల్లా కలెక్టర్, భీమిలి ఎమ్మెల్యే పెన్షన్ నగదును అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ అడపా లవరాజు, తహశీల్దార్ లోకవరపు రామారావు, వైసిపి నాయకులు బంక సత్యం, మజ్జి వెంకటరావు, కోరాడ వెంకటరావు, పాండ్రంకి శ్రీను, కోరాడ ముసలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పెంచిన పింఛన్లు నేడు పంపిణీ

ప్రజాశక్తి- పద్మనాభం: పెంచిన పింఛన్లను మండలంలోని పద్మనాభం మండల కాంప్లెక్స్‌లో బుధవారం పంపిణీకి అధికారులు ఏర్పాటుచేశారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు లబ్ధిదారులకు పంపిణీచేస్తారని ఎంపిపి రాంబాబు తెలిపారు. ఈ కార్యక్రమానికి సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు హాజరుకావాలని కోరారు.

కేలండర్ల ఆవిష్కరణలు

ప్రజాశక్తి -యంత్రాంగం

గాజువాక : యుటిఎఫ్ ముంద్రించిన నూతన సంవత్సర కేలండర్‌ను గాజువాకలో ఎంఇఒలు బి.విశ్వనాథం, ఎం.సునీత మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, యుటిఎఫ్ లక్ష్యంతో పనిచేసే సంఘం అని చెప్పారు. కేలండర్ ఆవిష్కరణకు ముందుగా యుటిఎఫ్ గాజువాక మండలశాఖ ప్రధాన కార్యదర్శి సబ్బారపు నూకరాజు ఆధ్వర్యాన సంఘం నాయకులు ఎంఇఒలకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల సహాధ్యక్షులు ఎండీ అబ్దుల్‌హుక్, జిల్లా కార్యదర్శులు డి.అబ్రహాంలింకన్, ఎస్.విజయ్‌కుమార్, మండల నాయకులు బి.సువర్ణలత, కె.చెల్లారావు, రవికుమార్, అనితకుమారి, రాంబాయి, నిరుపమ, ఇందిర, ప్రసూనాంబ తదితరులు పాల్గొన్నారు.



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఇఒలు, యుటిఎఫ్ నాయకులు


కేలండర్లను ఆవిష్కరిస్తున్న నేషనల్ హెల్త్ మిషన్ యూనియన్ నాయకులు

మధురవాడ : నేషనల్ హెల్త్ మిషన్ కేలండర్‌ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జగదీశ్వరరావు, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హెల్త్ మిషన్ యూనియన్ నాయకులు గోపీనాథ్, వీరబ్రహ్మం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చంద్రంపాలెం జాతరగట్టు దుర్గాలమ్మ అమ్మవారి 2024 సంవత్సరం కేలండర్‌ను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పిళ్లా చంద్రశేఖర్, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు పిళ్లా కృష్ణమూర్తిపాత్రుడు, ఆలయ కమిటీ ప్రతినిధులు పిళ్లా సూరిబాబు, పిళ్లా శ్రీనివాసరావు, జగుపిల్లి నాని, పీస రామారావు, పివిజి.అప్పారావు, దుక్క వరం, పిళ్లా వెంకటరమణ, గూడేల రాజు, మరుపిల్లి ఆనంద్, జగుపిల్లి అప్పారావు, పిళ్లా అప్పన్న, పిళ్లా పోతరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-వేపగుంట : పురుషోత్తపురంలోని కృష్ణారాయపురం 11 కెవి ఫీడర్ మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగింపు పనుల్లో భాగంగా బుధవారం విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు జోన్ -3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోలాకి శ్రీనివాసరావు ప్రకటన విడుదలచేశారు. పాత, కొత్త హెచ్‌బి కాలనీ, కృష్ణరాయపురం, వరలక్ష్మీనగర్, సంతోష్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

నేరాలు ఘోరాలు

గ్యాంగ్ రేప్‌లో 13 మందిపై పోక్సో కేసు

ప్రజాశక్తి- సీతమ్మధార : విశాఖలో సంచలనం రేపిన గ్యాంగ్ రేప్ కేసులో దర్యాప్తు చేసి 13 మంది నిందితులపై పోక్సో కేసును పోలీసులు నమోదుచేశారు. 11 మందిని అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు ఇమ్రాన్, షోయబ్‌ను పట్టుకునేందుకు స్పెషల్ టీమ్స్ రంగంలోకి దిగాయి. మరోవైపు గ్యాంగ్ రేప్ ఘటనపై ఏపీ మహిళా కమిషన్ సుమోటోగా స్పందించింది. సమగ్ర విచారణ జరిపి పూర్తి నివేదిక ఇవ్వాలని, నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని విశాఖపట్నం పోలీసు కమిషనర్‌ను మహిళా కమిషనర్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ ఆదేశించారు. దీంతో దర్యాప్తు ముమ్మరమైంది. దిశ పోలీసులు పక్కా ఆధారాలు సేకరించారు. విశాఖలోని లక్ష్మీ ఇన్ లాడ్జిలో బాలికపై పలుమార్లు అఘాయిత్యానికి పాల్పడినట్టు తేలింది. లాడ్జిల్లోని హార్డ్ డిస్క్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో బీచ్ ఫొటోగ్రాఫర్లు షరీఫ్ అలియాస్ రాజు అలియాస్ చెర్రీ, వంకా గోపి, సురేష్, హరీష్ అశోక్, నాగేంద్ర, శివరామకృష్ణ తదితరులున్నారు. మరి కొంతమంది పాత్రపైనా ఆరా తీస్తున్నారు. నిందితులు జార్ఖండ్‌కు పారిపోయారని సమాచారంతో స్పెషల్ టీమ్స్ రంగంలోకి దిగాయి. డిసెంబర్ 17 నుంచి 22 వరకు విశాఖలోని వేర్వేరు లాడ్జిల్లో బాలికపై అత్యాచారం జరిగినట్టు పేర్కొన్నారు. బాధితురాలు మైనర్ కావడంతో ఆమె గుర్తింపు బయటకు పొక్కకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని, నాలుగు నెలల్లోనే శిక్షపడేలా చర్యలు చేపడుతున్నామని పోలీసులు చెబుతున్నారు.

హష్మీకి ఘన నివాళి

ప్రజాశక్తి - ఆరిలోవ : ప్రజా కళాకారుడు, వీధి నాటక ప్రయోక్త హష్మీ 35వ వర్ధంతిని ప్రజా నాట్యమండలి ఆధ్వర్యాన మంగళవారం తోటగరువు, బిఎన్‌ఆర్‌నగర్‌లో ఘనంగా నిర్వహించారు. హష్మీ చిత్రపటానికి ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి ఎం.చంటి, రాష్ట్ర కమిటీ సభ్యులు జి.భారతి, జిల్లా నాయకులు వై.అప్పారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రజా నాట్యమండలి నాయకులు మాట్లాడుతూ, కార్మికులు, ప్రజలు చేస్తున్న పోరాటాలకు సంఘీభావంగా నిలుస్తామన్నారు. భవిష్యత్తులో మరిన్ని దళాలను తయారుచేసి ప్రజా సమస్యలపై కళారూపాలను ప్రదర్శిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు అసరాడ రమణ, నాగరాజు, కవి ప్రసాద్, సన్యాసమ్మ తదితరులు పాల్గొన్నారు.

చేనేత వస్త్ర ప్రదర్శన ప్రారంభం

ప్రజాశక్తి- పిఎం పాలెం : మధురవాడ శిల్పారామంలో ఏర్పాటుచేసిన అఖిల భారత చేనేత వస్త్ర ప్రదర్శనను మంగళవారం భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, భారతదేశం నలుమూలల నుంచి సుమారు 100 మంది తాము తయారుచేసిన ఉత్పత్తులను ప్రదర్శించి విక్రయించడం గొప్ప విషయం అన్నారు. శిల్పారామం స్థానిక పరిపాలన అధికారి విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ, హ్యాండ్లూమ్ చీరలు, డ్రెస్ మెటీరియల్స్, మంగళగిరి, వెంకటగిరి జరీ, చీరాల, మచిలీపట్నం, కడప, నారాయణపేట్, ఉప్పాడ, ధర్మవరం, పోచంపల్లి, సిద్ధిపేట కాటన్, పెద్దాపురం, కుప్పడం శిల్క్ గద్వాల్ శిల్క్, వరంగల్ డర్రీస్, శ్రీకాకుళం ఖాదీ, కడప కాటన్ ప్రింటెడ్ టవల్స్, లుంగీలు, కాశ్మీరి శిల్క్, ఉత్తర్ ప్రదేశ్ బెడ్ షీట్స్, కాటన్ బెడ్ షీట్స్, దర్రీస్ భాగల్పూర్ చాదర్, శిల్క్ షర్టింగ్, మధురై చీరలు, శంబల్పూరి ఇక్కత్ తదితరాలను ఈ క్రాఫ్ట్ మేళాలో విక్రయానికి అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఆంధ్ర ప్రదేశ్ శిల్పారామం సొసైటీ ఏర్పాటుచేసిన ఈ అఖిల భారత వస్త్ర ప్రదర్శన ఈ నెల 16వ తేదీ వరకు అందుబాటులో ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బొట్ట అప్పలరాజు, పిళ్లా సుజాత, సత్యనారాయణ, పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు, పోతిన హనుమంతురావు, గాదే రోశిరెడ్డి, పోతిన ప్రసాద్, బగాది లక్ష్మణ, వండ్రాసి రవికుమార్, కొండపల్లి వరలక్ష్మి, షేక్ జహనర తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రిని పరామర్శించిన గంటా

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని పాండ్రంగి గ్రామానికి చెందిన మాజీ మంత్రి అప్పలనరసింహరాజును మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు మంగళవారం పరామర్శించారు. అప్పల నరసింహరాజు ఆరోగ్య పరిస్థితిని గంటా అడిగి తెలుసుకున్నారు. సుమారు గంటసేపు ప్రస్తుత రాజకీయాలపై చర్చించుకున్నారు. అనంతరం పొట్నూరు గ్రామంలో కిలారి వారి సారీ ఫంక్షన్‌లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రాజబాబు, కె.రమణ, కె.దామోదరరావు, కె.సత్యనారాయణ, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ సమ్మె ఉద్రిక్తం

- విశాఖలో 500 మంది అరెస్టు
- బలవంతంగా చెత్త తరలింపు వాహనాలను బయటకు తీసేందుకు అధికారుల యత్నం
- ఎక్కడికక్కడ అడ్డుకున్న కార్మికులు



జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టిన నీటి సరఫరా విభాగం కార్మికులు



శ్రీహరిపురంలో అరెస్టులు

ప్రజాశక్తి - యంత్రాంగం

విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు విశాఖలో చేపట్టిన సమ్మె 8వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా పారిశుధ్య వాహనాలను నిలిపి ఉంచే యార్డుల వద్ద మున్సిపల్ కార్మికులు మంగళవారం పెద్ద ఎత్తున మోహరించి నిరసన తెలిపారు. ప్రైవేటు వ్యక్తులతో వాహనాలను బయటకు తీసి పారిశుధ్య పనులు చేపట్టడం కోసం జివిఎంసి అధికారులు చేసిన ప్రయత్నాలను మున్సిపల్ కార్మికులు ప్రతిఘటించారు. వాహనాలను బయటికి తీయకుండా అడ్డుకున్నారు. ఈ క్రమంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు 500 మందిని అరెస్టు చేశారు. అక్రమ అరెస్టులను సిఐటియు విశాఖ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెఎం.శ్రీనివాసరావు, ఆర్‌కెఎస్‌వి.కుమార్‌లు తీవ్రంగా ఖండించారు. మున్సిపల్ కార్మికులు ఎనిమిది రోజులుగా శాంతియుతంగా సమ్మె చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం పోటీ కార్మికులను పెట్టి పనిచేయించి సమ్మెను విచ్ఛిన్నం చేయాలని అనుకోవడం సరైందికాదన్నారు. స్థానిక వైసిపి ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, మేయర్, మంత్రులు ముఖ్యమంత్రిపై ఒత్తిడి తెచ్చి మున్సిపల్ కార్మికుల సమాన పనికి సమాన వేతనం, గ్రాట్యుటీ వంటి 13 డిమాండ్లను నెరవేర్చాలన్నారు.

నీటి సరఫరా కార్మికుల సమ్మె విజయవంతం

జివిఎంసి నీటి సరఫరా కార్మికులు మంగళవారం నుంచి సమ్మెలో పాల్గొన్నారు. వారంతా జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి మాట్లాడారు. నగర పరిధిలో 70 శాతం మంది నీటి సరఫరా కార్మికులు సమ్మెలో పాల్గొన్నారని చెప్పారు. కార్మికులు గతంలో సాధించుకున్న జిఒ 96ను ప్రభుత్వం అమలు చేయకపోవడం దారుణమన్నారు. వారి నిరసనకు విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు సంఘీభావం తెలిపారు.

పారిశుధ్య వాహనాలు అడ్డగింత

అనకాపల్లి : తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మెలో భాగంగా జీవీఎంసీ జోనల్ కార్యాలయం ముందు మంగళవారం వంటా వార్పు చేసి తమ నిరసన తెలిపారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ వాహనాలను చెత్తను తరలించేందుకు బయటకు తీస్తుండగా కార్మికులు అడ్డుకున్నారు. జోనల్ కమిషనర్ వెంకటరమణ, కార్మికులకు మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. దీంతో వాహనాలను నిలుపుదల చేశారు. పోలీసు వచ్చి బలవంతంగా వాహనాలు తీయించాలని ప్రయత్నించగా, కార్మికులు అడ్డుకున్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు గంట శ్రీరామ్, జిల్లా అధ్యక్షులు ఆర్.శంకర్రావు, జి సత్యనారాయణ, బొమ్మల రాము, నిమ్మకాయల అజయ్, శివ కుమార్, నూకరాజు, గణేష్, సంతోష్, శ్రీను, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్ : సమస్య పరిష్కారానికి సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులు సోమవారం ఎనిమిదో రోజున. సిబిఎం కాంపౌండ్ నుండి శ్రీకన్య కూడలి వరకు ర్యాలీ చేపట్టారు. కోవిడ్ సమయంలో తాము ఫ్రంట్ లైన్ వారియర్స్‌గా అందిస్తున్న సేవలను గుర్తు చేస్తూ వినూత్న నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు మాట్లాడుతూ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందరికీ పర్మినెంట్ చేస్తానని సిఎం జగన్ విపక్షంలో ఉన్నపుడు ఇచ్చిన హామీని మరిచిపోయారని మండిపడ్డారు. ప్రజారోగ్యమే లక్ష్యంగా ప్రాణాలకు తెగించి విధులు నిర్వహిస్తున్న ఫ్రంట్‌లైన్ కార్మికుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం తగదన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బొర్రా శ్రీనివాసరావు, కుపరాల రాజు, నేతల దేముడు, రమణ, కుమార్ పాల్గొన్నారు.



నర్సీపట్నంలో ర్యాలీ చేస్తున్న కార్మికులు

మధురవాడ : జివిఎంసి 5, 6, 7, 8 వార్డుల్లో సమ్మెలో ఉన్న కార్మికులను మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. కార్మికులను ఈడ్చుకుంటూ తీసుకెళ్లి జీపుల్లోకి ఎక్కించారు. దీంతో కొంతమంది కార్మికులు స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. నగరంపాలెం, మారికవలస, పిఎం.పాలెం తదితర ప్రాంతాలలో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. మహిళా కార్మికులను మగ పోలీసులతో అరెస్టు చేయించారని, చుట్టు ముట్టి అరెస్టులు చేశారని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 60 మందిని అరెస్టు చేశారు. అనంతరం పూచీకత్తుపై విడుదలచేశారు. అరెస్టులు చేయాలనుకుంటే మహిళా పోలీసులను పెట్టుకోవాలి తప్ప మగ పోలీసులతో ఎలా ఈడ్చుకెళ్తారని సిఐటియు ఉపాధ్యక్షులు డి.అప్పలరాజు ప్రశ్నించారు. అరెస్టయిన వారిలో సిఐటియు జోన్ కార్యదర్శి పి.రాజ్‌కుమార్, నాయకులు జి.కిరణ్, ఎస్.రామప్పడు, సిహెచ్.శేషుబాబు, పప్పి, బి.రాంబాబు, యు.లక్ష్మి, ఎం.సుశీలమ్మ, కె.నాగరాజు, ఆదిలక్ష్మి, లలిత, ఎ.నరేంద్ర, కె.రాజేశ్వరి, ఐ.ఆదినారాయణ, కె.విజయమ్మ, కె.లక్ష్మి, తదితరులు ఉన్నారు.

నిర్లక్ష్య వైఖరి తగదు : టిడిపి

పారిశుధ్య కార్మికుల సమస్యల పట్ల నిర్లక్ష్య వైఖరి తగదని 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత, టిడిపి రాష్ట్ర బిసి సెల్ ప్రధాన కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు అన్నారు. మారికవలస రాజీవ్ గృహకల్ప ఏరియాలో సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు.

ములగాడ : శ్రీహరిపురంలో సిఐటియు నాయకులు అర్.లక్ష్మణమూర్తితోపాటు 10మంది జివిఎంసి కార్మికులను అరెస్టు చేసి మల్కాపురం పోలీస్ స్టేషన్‌కు పోలీసులు తరలించారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రయత్నించకుండా అరెస్టులు చేయడాన్ని లక్ష్మణమూర్తి ఖండించారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సమస్యను పరిష్కరించి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని కోరారు.



మధురవాడ జోన్‌లో కార్మికులను అరెస్టు చేస్తున్న పోలీసులు

గాజువాకలో అర్ధనగ్న ప్రదర్శన

గాజువాక : సమస్యలు పరిష్కరించాలని జివిఎంసి గాజువాక జోనల్ కార్యాలయం ఎదుట పారిశుధ్య కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి గొలగాని అప్పారావు, సిఐటియు నాయకులు ఎ.లోకేష్, రాము, నక్క నాగరాజు, గణేష్, వై.చిన్నారావు, శంకర్‌రెడ్డి, రామకృష్ణ, సూరిబాబు, అప్పలస్వామి, భాస్కర్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



అనకాపల్లిలో వాహనాలను అడ్డుకుంటున్న మున్సిపల్ కార్మికులు



గాజువాకలో అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న కార్మికులు



మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలిస్తున్న గొండు సీతారాం

'గోరుముద్ద' పరిశీలన

ప్రజాశక్తి-సీతమ్మధార : సీతమ్మధార పరిధి జివిఎంసి ఎన్ఎంసి.హైస్కూల్‌లో 'గోరుముద్ద' అమలు తీరును ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం మంగళవారం పరిశీలించారు. మధ్యాహ్నం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం విద్యార్థులతోను, విద్యా శాఖాధికారులు, మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులు, అక్షయ పాత్ర ప్రతినిధులతో మాట్లాడారు. 'మొత్తం ఎంతమంది విద్యార్థులు భోజనం చేస్తున్నారు.. తినని వారు ఎందరున్నారు.., తినని పిల్లల తల్లిదండ్రులకు పౌష్టికాహారంపై ఎటువంటి అవగాహన కల్పిస్తున్నారు...' అని అడిగి తెలుసుకున్నారు. కోడిగుడ్డు నాణ్యత, బరువుపై ఆరా తీశారు, ఆహార పదార్థాలను మార్పు చేయాల్సిన అంశాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీతారాం మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో మధ్యాహ్న భోజన పథకంపై పరిశీలన జరుపుతున్నామని చెప్పారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, యాజమాన్య కమిటీలు సూచించిన మార్పులు, చేర్పులను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. ఈ పథకంలో ఏవైనా ఇబ్బందులు, సమస్యలుంటే apscpcr2018@gmail.comకు సమాచారం అందిస్తే ఆయా జిల్లాల కలెక్టర్లు, అధికారులకు చర్యలు నిమిత్తం సిఫారసులు చేయనున్నట్లు సీతారాం తెలిపారు. ఈ పర్యటనలో సీతమ్మధార మండల విద్యాశాఖాధికారి డి.రామారావు, మధ్యాహ్న భోజన పథకం అమలుతీరు పరిశీలనాధికారి జెఎస్.శాస్త్రి,అక్షయ పాత్ర ఫౌండేషన్ మేనేజర్ వి.రామ్‌మోహన్, స్కూల్ ప్రిన్సిపాల్ రామ్ ప్రసాద్, స్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్ పి.రఘు, ఎస్.కరుణాకర్, బి.హెన్నా, సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శులు, సంక్షేమ,ఆరోగ్య కార్యదర్శులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 26వ వార్డు పరిధి శంకువాణిపాలెం, లలితానగర్, రామకృష్ణనగర్, ఎన్జీవోస్ కాలనీ తదితర ప్రాంతాల్లో రూ.52.75 లక్షల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు వార్డు వైసిపి ఇన్‌ఛార్జి పీలా వెంకటలక్ష్మితో కలిసి ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఆయా ప్రాంత ప్రజలతో మాట్లాడి సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సహకారంతో ఉత్తర నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. విద్య, ఉపాధి, ఆరోగ్యంపై ముఖ్యమంత్రి దృష్టి పెట్టారన్నారు. వార్డుల వారీగా మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, వైసిపి నాయకులు కిరణ్‌రాజు, బోడ్డేటి కిరణ్, రేవతిరావు, పాండవశ్రీను, సునీల్, శేషు, విజయపాల్, ప్రకాష్, బాపూన్ చౌదరి, అమ్మాజీ, శ్యామల, రమాదేవి, జి.లక్ష్మి, సుశీల, గౌషియా, బాబ్జాన్, పి.రాము, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తూ పలు సూచనలిస్తున్న కెకె.రాజు

సాధికార బస్సుయాత్ర ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-సీతమ్మధార : కైలాసపురంలోని పోర్టు ఆసుపత్రి సమీపంలో ఇనార్బిట్‌మాల్ ప్రాంగణంలో ఈ నెల 6వ తేదీన నిర్వహించనున్న వైసిపి సామాజిక సాధికార బస్సు యాత్ర ఏర్పాట్లను ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు మంగళవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కట్టుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, ఆళ్ల లీలావతి, నాయకులు ఆళ్ల శ్రీనివాస్, కిరణ్ రాజు, ఆళ్ల శివ గణేష్, గుడ్డల భాస్కర్ రెడ్డి, బోడ్డేటి కిరణ్, ఎం.సునీల్, కె.చిన్న, గుడ్ల అశోక్‌రెడ్డి, కృప పాల్గొన్నారు.

శారదా నదిలో

ఇసుక తవ్వకాలు అడ్డగింత

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండలంలోని తెనుగుపూడి శారదానది పరీవాహక ప్రాంతంలో ఎటువంటి మైనింగ్ అనుమతులు లేకుండా జెసిబి సహాయంతో ఇసుక తరలిస్తుండడంతో మంగళవారం ఆ గ్రామ ప్రజలంతా ఏకమై అడ్డుకున్నారు. ఈ విషయంపై ఎస్ఐ, తహశీల్దార్‌కు గ్రామస్తుల సమాచారం ఇచ్చారు. దీంతో సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ డి.నాగేంద్ర జెసిబితో ఇసుక తవ్వకాల పనులను నిలుపుదల చేశారు. అయితే ఇసుక తరలింపును ఆపాలని స్థానికులు ఎస్ఐను కోరగా, ఈ ట్రాక్టర్లకు ఇసుక టోకెన్లు తహశీల్దార్ మంజూరు చేసి ఉన్నారని ఎస్ఐ స్పష్టం చేశారు. దీంతో మైనింగ్‌కు ఎటువంటి అనుమతులు లేకుండా ఎలా ఇసుక తరలింపునకు, జెసిబితో తవ్వకాలకు అనుమతులు ఇచ్చారని తహశీల్దారును ప్రశ్నించేందుకు మాజీ ఎంపిటిసి పెంటకోట అప్పలనాయుడు, పెంటకోట వెంకటరమణ, చామంతుల చిన్న, దాసరి గోవింద, గరిమెళ్ల శ్రీను, కొట్యాడ సామాలు, గ్రామస్తులు తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లారు. అయితే వారికి చేదు అనుభవం ఎదురైంది. వారంతా మధ్యాహ్నం ఒంటిగంటకు తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లగా, సాయంత్రం 4 గంటలు దాటినా తహశీల్దార్ రాలేదు. దీంతో వారంతా వెనుదిరిగారు. మార్గమధ్యలోకి వెళ్లే సరికి గర్భింగి వెళ్లాల్సిన ఇసుక ట్రాక్టర్లు దేవరాపల్లి వైపు వస్తుండడంతో వారు మళ్లీ ఎస్ఐ నాగేంద్రకు ఫోన్ చేయడంతో పోలీసులు ఆ ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించారు. ఈ విషయంపై ఎస్ఐ మాట్లాడుతూ ఇసుక తవ్వుతున్న జెసిబి, రెండు ఇసుక ట్రాక్టర్లను తహశీల్దార్ కోర్టులో హాజరు పర్చామని, తహశీల్దారు వెరిఫికేషన్ చేసిన తరువాత తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ విషయంపై తహశీల్దారును వివరణ కోరగా సమాధానం చెప్పేందుకు ఆమె నిరాకరించారు.



ఇసుక తవ్వకాలకు ఉపయోగించిన జెసిబి

ప్రభుత్వ పనుల పేరుతో టోకెన్లు.. అడ్డగోలుగా ఇసుక తవ్వకాలు

ఈ సందర్భంగా తెనుగుపూడి గ్రామ యువకులు మాట్లాడుతూ తెనుగుపూడి వద్ద శారదానది పరీవాహక ప్రాంతంలో ఇసుక తవ్వకాలకు ఎటువంటి అనుమతులు లేవని తెలిపారు. ప్రభుత్వ నిర్మాణ పనుల పేరుతో తహశీల్దారు టోకెన్లు ఇవ్వడంతో, వాటితో అడ్డగోలుగా ఇసుక తవ్వకాలు చేస్తున్నారని ఆరోపించారు. ఇసుక ఎక్కడ తవ్వాలో, ఆ ఇసుకను ఎక్కడికి తరలిస్తారో అనే విషయాలతో టోకెన్ల ఇవ్వాల్సి ఉండగా, ఆ వివరాలు ఏమీ లేకుండానే అధికార పార్టీ పెద్దలకు తలొగ్గి ఖాళీ టోకెన్లపై తహశీల్దారు సంతకాలు చేసి ఇస్తున్నారని విమర్శించారు. దీంతో ఒకే టోకెన్‌తో రోజంతా అక్రమంగా ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. జెసిబితో తవ్వకాలు చేయకూడదన్న నిబంధనలు కూడా పాటించడం లేదని తెలిపారు. ఒక వైపు ఇసుక అక్రమ రవాణాపై ప్రజలు పోరాడుతుంటే పట్టించుకోవాల్సిన అధికారులు ఇలా అడ్డగోలుగా ఇసుక తరలింపునకు సహకరించడం సరికాదని వారు మండిపడ్డారు.



ఎస్ఐ సమక్షంలో ఘర్షణ పడుతున్న దృశ్యం

వ్యక్తిపై ఉప సర్పంచ్ దాడి.. పోలీసులకు ఫిర్యాదు

ఇసుక తవ్వకాలపై చేసిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ డి.నాగేంద్ర సంఘటనా స్థలానికి చేరుకొని ఇసుక తవ్వకాల పనులు నిలుపుదల చేసిన సమయంలో, ఆయన సమక్షంలోనే స్థానిక ఉపసర్పంచ్ కాటిపాము నాయుడు అదే గ్రామానికి చెందిన భీమిని పోతురాజుపై దాడి చేశారు. ఈ విషయంపై పోతురాజు మంగళవారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు.



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రసాద్, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నేతలు

డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అచ్యుతాపురం

భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) సంఘాల సంయుక్తంగా రూపొందించిన 2024 కేలండర్‌ను మంగళవారం స్థానిక ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాల ఛైర్మన్ దర్మిరెడ్డి ప్రసాద్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువులో శ్రద్ధ చూపించి ఉన్నత శిఖరాలకు చేరాలని కోరారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు చింతకాయల శివాజీ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల్లో ఉన్న ఖాళీ ఉద్యోగాలు వెంటనే భర్తీ చేయాలని, పరిశ్రమల్లో 70 శాతం ఉద్యోగాలు స్థానికులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఉపాధి కల్పనలో అన్ని రాజకీయ పార్టీలు నిరుద్యోగులకు మొండిచెయ్యి చూపుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గీతాకృష్ణ, ఎమ్.రమణ సిఐటియు మండల కార్యదర్శి కె.సోమునాయుడు పాల్గొన్నారు.

ఉచిత పశువైద్య శిబిరం

ప్రజాశక్తి-కశింకోట

మండలంలోని ఎఎస్.పేట బీసీసీ పరిధిలోని తాళ్లపాలెం పాల ఉత్పత్తిదారుల సంఘ భవనం వద్ద మంగళవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఎద రిపీట్ అవుతున్న 17 పాడి పశువులకు వైద్య సేవలు అందించారు. ఇందులో పాల్గొన్న విశాఖ డెయిరీ డైరెక్టర్, ఎలమంచిలి మున్సిపల్ ఛైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి మాట్లాడుతూ పాడి పశువులకు నూకల జావ పెట్టవద్దని, పచ్చగడ్డికి యూరియా వేసిన 20 రోజులు తర్వాత మాత్రమే పశువులకు మేతగా వేయాలని సూచించారు. అనంతరం మినరల్ మిక్సర్ ప్యాకెట్లు, మందులు పాడి రైతులకు అందజేశారు. కార్యక్రమంలో విశాఖ డైరెక్టర్ మలసాల రమణారావు, యూనిట్ ఆఫీసర్ శ్రీను, సూపర్వైజర్ సత్యనారాయణ, సంస్థ అధ్యక్షులు గుమ్మడి నారాయణరావు, మాజీ అధ్యక్షులు సత్యనారాయణ, వేతన కార్యదర్శి శ్రీను, పాడి రైతులు, డెయిరీ వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.



పశు వైద్య శిబిరంలో మాట్లాడుతున్న విశాఖ డెయిరీ డైరెక్టర్ రమాకుమారి

సుగర్స్ బకాయిలు రూ.12.30 కోట్లు విడుదల

ప్రజాశక్తి- చోడవరం

చోడవరం సుగర్ ఫ్యాక్టరీ చెరకు రైతుల బకాయిలతో పాటు కార్మికుల జీతభత్యాల నిమిత్తం ఇవ్వవలసిన రూ.12.30 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం నిధుల నుండి విడుదలైనట్లు ప్రభుత్వ విప్, స్థానిక శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ తెలిపారు. చోడవరంలో మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గత సీజన్‌కు సంబంధించి రైతులకు టన్నుకు రూ.2500 చొప్పున బట్వాడా జరిగిందని, ఇంకా రూ.321 రైతులకు ఇవ్వవలసి ఉందని, అలాగే కార్మికులకు జీతాలు బకాయి ఉన్నాయని చెప్పారు. ఫ్యాక్టరీ స్థితిగతులను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి వివరించడంతో ఆయన సానుకూలంగా స్పందించి ప్రభుత్వ గ్రాంటు నుండి నిధులు మంజూరు చేయడం హర్షణీయమన్నారు. ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం నుండి రూ.80 కోట్లు ఫ్యాక్టరీకి గ్రాంట్‌గా వచ్చిందని, దీంతో రూ.150 కోట్లు అప్పుల్లో ఉన్న ఫ్యాక్టరీ ప్రస్తుతం రూ.40 కోట్లు అప్పుకు చేరిందని చెప్పారు. బకాయికి సంబంధించిన బిల్లులను సమర్పించడంతో పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరుకు అంగీకరించినట్లు తెలిపారు. రెండు మూడు రోజుల్లో రైతులు ఖాతాలోకి నేరుగా నిధులు జమవుతాయని ధర్మశ్రీ తెలిపారు.

మంత్రులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు



మంత్రి అమర్‌నాథ్‌ను కలిసిన మలసాల ధనమ్మ, రమణరావు, భరత్

ప్రజాశక్తి-అనకాపల్లి

రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడుకు మంగళవారం పలువురు అధికారులు, పార్టీ నాయకులు కలిసి ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. మిందిలోని మంత్రి అమర్నాథ్ క్యాంపు కార్యాలయానికి వైసిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, కసింకోట మండల అధ్యక్షులు మలసాల కిషోర్, చోడవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఏరువాక సత్యారావు, అనకాపల్లి మార్కెట్ కమిటీ ఛైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ చిక్కాల రామారావు, అనకాపల్లి నూకాంబిక అమ్మవారి ఆలయ ఛైర్మన్ కొణతాల మురళి, కసింకోట జడ్పిటిసి శ్రీధర్ రాజు, పార్టీ అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట రామయ్య, ఐలా కమిషనర్ జయచంద్ర, ఎపిఐఐసి జోనల్ మేనేజర్ త్రినాథ్, వైసిపి గాజువాక నియోజకవర్గ ఇన్చార్జి ఉరుకుటి చందు, గంగుపాము నాగేశ్వరరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పెద్ద సంఖ్యలో వచ్చి పుష్పగుచ్ఛాలని అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

కశింకోట : రాష్ట్ర మంత్రి అమరనాథ్‌ను ఎంపీపీ కలగ లక్ష్మీ గున్నయ్యనాయుడు, జెడ్పీటీసీ శ్రీధర్ రాజు, విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు, మాజీ జెడ్పీటీసీ మలసాల ధనమ్మ, మలసాల భరత్ కుమార్ తదితరులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

డిప్యూటీ సిఎం బూడికి...

చోడవరం : వైసిపి వైద్య విభాగం జిల్లా అధ్యక్షులు డాక్టర్ బండారు సత్యనారాయణ మంగళవారం ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడును మంగళవారం తారువలోని ఆయన నివాసంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బండారు సత్యనారాయణ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పార్టీ నిర్ణయం మేరకు ఎవరికి టికెట్ కేటాయించిన పనిచేస్తామన్నారు.

దేవరాపల్లి : ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు తారువలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో అనకాపల్లి ఆర్‌డిఒ చిన్నికృష్ణ, మండల తహశీల్దారు ఎమ్.లక్ష్మి, వీఆర్వో సంఘం అధ్యక్షులు పోతల శంకరరావు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నాలుగు మండల గ్రామీణ నీటిపారుదల శాఖ అధికారులు, అనకాపల్లి డిఈ నాగేశ్వరరావు, అల్లు సూర్యనారాయణ, జెఈ, నాలుగు మండలాల ఏఈలు, సిహెచ్‌వి సింహరావు, శ్వేత, శ్రీకాంత్, చంద్రశేఖర్‌రావు శుభాకాంక్షలు తెలియజేశారు.



డిప్యూటీ సిఎం బూడిని కలిసిన డాక్టర్ బండారు తదితరులు

జ్యూట్ బ్యాగుల పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి

స్థానిక గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక రింగ్ రోడ్డు లక్ష్మీ గణపతి ఆలయం వద్ద మంగళవారం జ్యూట్ బ్యాగులను ఉచితంగా పంపిణీ చేశారు. గ్రీన్ క్లబ్ 9వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సంఘ సేవకులు కర్రి సన్యాసినాయుడు చేతుల మీదుగా 150 బ్యాగులను అందజేశారు. కార్యక్రమంలో గ్రీన్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు కర్రి ఫణి భూషణ్ శ్రీధర్ మాస్టారు, క్లబ్బు గౌరవ అధ్యక్షులు పెంటకోట ఉమామహేశ్వరరావు, ఎల్లపు సూరి అప్పారావు, కాండ్రేగుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



పంపిణీ చేసిన బ్యాగులతో ప్రజలు, నిర్వాహకులు



రగ్గులు పంపిణీ చేస్తున్న దృశ్యం

వికలాంగులకు రగ్గుల పంపిణీ

ప్రజాశక్తి-కశింకోట

మండలంలోని చింతలపాలెం గ్రామంలో 16 మంది వికలాంగులకు తాళ్ళపాలెం సత్యసాయి భజన మండలి సహకారంతో మంగళవారం రగ్గులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వికలాంగులు సంఘం అధ్యక్షుడు షేక్ రెహమాన్, గ్రామ సర్పంచ్ కొట్టా రాము, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కొట్టా సత్యనారాయణ, వైసిపి నాయకులు షేక్ బాబురావు, షేక్ ఇస్మాయిల్, గుమ్మడి అప్పలరాజు పాల్గొన్నారు.

కేబుల్ గోతులతో రోడ్లు పాడు!

ప్రజాశక్తి- అనంతగిరి

సెల్, కేబుల్ సౌకర్యం అందుబాటులోకి వస్తుందని హర్షంవ్యక్తం చేయాలో, లేకుంటే అంతంతమాత్రంగా ఉన్న రోడ్లు అండర్ గ్రౌండ్ కేబుల్ లైన్ల పుణ్యమాని పాడౌతున్నాయని బాధపడాలో తెలియని స్థితిలో మన్యవాసులు ఆవేదన చెందుతున్నారు. ఒఎఫ్‌సి కేబుల్ ఏర్పాటుకు రోడ్డు వెంబడి తీసిన గోతులను పూర్తిగా పూడ్చకుండా సంబంధిత సంస్థలు వదిలేయడంతో పలు ఇబ్బందులు తప్పడం లేదని వాపోతున్నారు. మండలంలో పలు గ్రామాలకు జియో, ఎయిర్ టెల్, బిఎస్ఎన్ఎల్, ఫైబర్ నెట్ వంటి సంస్థలు సెల్ సేవలను అందించేందుకు కేబుల్ లైన్లను ఏర్పాటు చేస్తున్నాయి. దేవరపల్లి మండలాన్ని ఆనుకొని జీనబాడు మీదుగా పినకోట,పెదకోట, హుకుంపేట మండలం ఉప్ప వరకు కేబుల్ లైన్లు కోసం తీసిన గోతులతో రోడ్లు ధ్వంసం అయ్యాయని జెడ్‌పిటిసి దీసరి గంగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. డముకు నుండి లంగుపర్తి, వేంగడ పంచాయతీల మీదుగా హుకుంపేట మండలం పట్టాం వరకు, అలాగే మండలంలో ప్రతి పంచాయతీ కేంద్రాలకు వెళ్లే తారు రోడ్లన్నీ ఇరువైపులా పూర్తిగా ధ్వంసం అయ్యాయిన్నారు. సంబంధిత కేబుల్, సెల్ నెట్‌వర్క్‌ల యాజమాన్యాలనీ ఇష్టానుసారంగా రోడ్డు పక్కల్లో కేబుల్ ఏర్పాటుకు గోతులు తవ్వేసి,తర్వాత వాటిని పూడ్చకుండా, చదును చేయకుండా వదిలేస్తున్నారని ఆరోపించారు. రోడ్డు పొడుగునా ఇదే పరిస్థితి ఉండడంతో రెండు వైపులా కేబుల్ గోతుల్లోని మట్టి కుంగిపోయి కాలువల్లా ఏర్పడడమే కాకుండా, దీని వల్ల ఏమాత్రం రోడ్డుదిగినా వాహనాలు ప్రమాదానికి గురౌతున్నాయని, అంతేకాక రోడ్డు పాడౌతోందని అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత సెల్ నెట్‌వర్క్ యాజమాన్యాలు స్పందించి రోడ్డు వెంబడి ఒఎఫ్‌సి ఏర్పాటుకు తీసిన గోతులను పూర్తిగా పూడ్చిపెట్టడంతోపాటు చదునుచేసి పటిష్టం చేయాలని కోరారు. లేకుంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

పడమటమ్మను దర్శించుకున్న పీలా

ప్రజాశక్తి -కశింకోట

మండలంలోని విస్సన్నపేటలో ఉన్న శ్రీపడమటమ్మ అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ మంళవారం దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు కుటుంబ సమేతంగా అమ్మవారికి ఘటాలను సమర్పించారు. అనంతరం కశింకోట మండలం తెలుగుదేశం పార్టీ శ్రేణులకు వన భోజనాలు నిర్వహించారు. కార్యక్రమంలో జివిఎంసి టిడిపి ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, పార్టీ నాయకులు పీలా శ్రీకాంత్, మురళి, ఉగ్గిన రమణమూర్తి, కూంద్రపు రామునాయుడు, పెంటకోట రాము, వేగి గోపికృష్ణ, సిద్దిరెడ్డి శ్రీనివాసరావు, షేక్ బాబర్, సిద్దిరెడ్డి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే పీలా తదితరులు

ఆరోగ్య సురక్షతో పేదలకు పూర్తి స్థాయి వైద్యం

రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్



తగరంపూడిలో ఆరోగ్య సురక్ష శిబిరంలో మంత్రి అమర్‌నాథ్

ప్రజాశక్తి- అనకాపల్లి

రాష్ట్రంలో పేదవారికి పూర్తిస్థాయిలో వైద్యం అందించేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మండలంలోని వెంకుపాలెం గ్రామం తగరంపూడి పిహెచ్సి పరిధిలో ఆరోగ్య శిబిరాన్ని మంగళవారం అమర్నాథ్ ప్రారంభించారు. శిబిరానికి వచ్చిన రోగులకు నిర్వహిస్తున్న వైద్య పరీక్షల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిపుణులైన డాక్టర్లతో వైద్య పరీక్షలు చేయించడమే కాకుండా, ఉచితంగా మందులు అందించే సౌకర్యం కల్పిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఏపీఐడబ్ల్యుఏ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైసిపి నాయకులు పెద్దిశెట్టి గోవింద, సర్పంచులు రాపేటి నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు రాపేటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



మునగపాక మండలం ఒంపోలులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మునగపాక : జగనన్న ఆరోగ్య సురక్షణను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎలమంచిలి నియోజకవర్గ శాసనసభ్యులు యువి రమణ మూర్తి రాజు కోరారు. మండలంలోని ఒంపోలు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ డిసిసిబి చైర్మన్ యు సుకుమార్ వర్మ, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జడ్పిటిసి పెంటకోట స్వామి సత్యనారాయణ, వైకాపా మండల కన్వీనర్ ఆడారి గణపతి అచ్చం నాయుడు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : ప్రజల ఆరోగ్యం వృద్ధి చెందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. మంగళవారం బుచ్చయ్యపేట మండలం మల్లాం గ్రామంలో నిర్వహించిన రెండో దశ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో డిపిఓ ఆర్.శిరీషా రాణి, వైద్యాధికారిని సంధ్యారాణి, జడ్పిటిసి సభ్యుడు దొండా రాంబాబు, మండల పార్టీ అధ్యక్షుడు జోగా కొండబాబు, వైసీపీ సీనియర్ నాయకులు దాకారపు నాగేశ్వరరావు, స్థానిక సర్పంచ్ బర్ల శివ, ఎంపీడీవో సువర్ణ రాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చోడవరం : చోడవరం పంచాయతీ సచివాలయం-3 వద్ద జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ప్రారంభించారు. దీర్ఘకాలిక రోగులకు నెల రోజులకు ఒకసారి పడే మందులను ఉచితంగా అందించారు.

కోటవురట్ల : రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మంగళవారం చౌడవాడలో వైద్య సిబ్బంది నిర్వహించారు. సచివాలయ పరిధిలోని పలువురికి సిహెచ్‌సి వైద్యులు,సిబ్బంది పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో మండల పరిషత్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆనందపురం : జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని ఆనందపురం మండలం వెల్లంకి పంచాయతీలో మంగళవారం భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, విశాఖ జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అన్ని రకాల వ్యాధులకు సంబంధించి ఉచిత వైద్యం అందిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ అడపా లవరాజు, తహశీల్దార్ లోకవరపు రామారావు, డిహెచ్ఎంఓ జగదీశ్వరరావు, నోడల్ ఆఫీసర్ శ్రీరామ్‌మూర్తి, వైసిపి మండల అధ్యక్షులు బంక సత్యం, జడ్‌పిటిసి కోరాడ వెంకట్రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకట్రావు, సర్పంచులు లక్ష్మణరావు, చందక లక్ష్మి, కాకర రమణ, పిన్నింటి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



బుచ్చయ్యపేట మండలం మల్లాం గ్రామంలో ఎమ్మెల్యే ధర్మశ్రీ

పద్మనాభం : పద్మనాభం మండలంలోని అయినాడ గ్రామపంచాయతీలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి గ్రామంలో వారంలో రెండు రోజులు ఈ కార్యక్రమం జరిగేలా విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రాంబాబు, జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్ సుంకర గిరిబాబు, మండల వైసిపి అధ్యక్షులు కె.లక్ష్మణరావు, నాయకులు కె.పాపారావు ఎం.శివ రామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఆనందపురం మండలం వెల్లంకిలో కలెక్టర్, ఎమ్మెల్యే

ఇండియన్ ఎయిర్ ఫోర్స్

ఫ్లయింగ్ ఆఫీసర్‌గా బెన్నవోలు యువకుడు

ప్రజాశక్తి- చోడవరం

మండలంలోని మారుమూల బెన్నవోలు చెందిన మజ్జి వెంకటసాయి దేశ రక్షణ రంగం ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో యుద్ధ విమానాలు నడిపే ఫ్లయింగ్ ఆఫీసర్ స్థాయికి ఎదిగారు. ఈ మేరకు వెంకటసాయిని మంగళవారం కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అభినందించారు. సాధారణ రైతు కుటుంబానికి చెందిన మజ్జి వెంకటసాయి ప్రాథమిక విద్యాభ్యాసం పట్టణంలోని రవి కాన్వెంట్లో సాగింది. తరువాత విజయనగరం జిల్లా కోరుకొండ సైనిక్ స్కూల్లో 12వ తరగతి వరకూ చదివారు. అనంతరం 2019లో ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌కు ఎంపికయ్యారు. ఎయిర్ ఫోర్సులో యుద్ధ విమానం పైలట్‌గా నాలుగు సంవత్సరాలు శిక్షణ పూర్తి చేసుకున్న వెంకట సాయి ఇటీవలే హైదరాబాదులోని దుండిగల్ ఎయిర్ ఫోర్స్‌లో చివరి విడత శిక్షణ పూర్తి చేసి ఫ్లయింగ్ ఆఫీసర్‌గా బెంగళూరులో విధుల్లో చేరారు. వెంకట సాయి తల్లిదండ్రులు మజ్జి లక్ష్మి, గౌరీ శంకరు. తండ్రి గౌరీశంకర్ వ్యవసాయ కమిటీ మాజీ చైర్మన్‌గా కూడా పనిచేశారు. తమ్ముడు దుర్గ ప్రసాద్ ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్ చదువుతున్నారు. సాధారణ వ్యవసాయ కుటుంబం నుంచి ఆర్మీలో ఫ్లయింగ్ ఆఫీసర్ క్యాడర్‌కు వెంకట సాయి ఎదగడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు. ఉమ్మడి జిల్లాల నుంచి ఈ పోస్ట్‌కు ఎంపికైంది వెంకట సాయి ఒక్కరే కావడం విశేషం.



కలెక్టర్ రవి పట్టన్‌శెట్టిని కలిసిన మజ్జి వెంకటసాయి

ఆటో కార్మికులను ఆదుకోవాలి

ప్రజాశక్తి -బుచ్చయ్య పేట : ఆటో కార్మికులకు ప్రభుత్వం పిఎఫ్, ఇఎస్ఐతో కూడిన సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి ఆదుకోవాలని ఎపి ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. మండలంలోని సీతయ్యపేటలో దుర్గా భవాని ఆటో వర్కర్స్ యూనియన్ స్టాండ్ వద్ద మంగళవారం జరిగిన సమావేశంలో లక్ష్మణ మాట్లాడుతూ రాష్ట్రంలో చదువుకున్న యువతకు ఉపాధి లేక ప్రత్యక్షంగా పరోక్షంగా 10 లక్షలపైబడి ఆటో రంగం మీద ఆధారపడి జీవిస్తున్నాని తెలిపారు. ఒక్క పక్క నిత్యవసర వస్తువుల ధరలు, మరో పక్క ఆటో స్పేర్ పార్ట్స్ ధరలు, ఇన్సూరెన్స్ ధరలు విపరీతంగా పెంచడంతో కార్మికుల జీవనంపై దెబ్బ మీద దెబ్బ పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పిల్లల రాజు, కండేపల్లి జగన్, షేక్ రెహమాన్, బంగారి రాజు, రవి, నాని, సురేష్, నాగరాజు పాల్గొన్నారు.



ఆటో కార్మికులకు కార్డులు అందజేస్తున్న లక్ష్మణ్

కార్మికశాఖ సహాయ కమిషనర్‌గా వసంతరావు

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి జిల్లా కార్మికశాఖ సహాయ కమిషనర్‌గా కె వసంతరావును నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఆయన మంగళవారం విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న కార్మిక సమస్యలు పరిష్కారం, కార్మిక శాఖ కార్మికుల సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామన్నారు. అసంఘటిత రంగ కార్మికులు తమ పేర్లను ఈ- శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకుని ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, వివిధ కార్మిక చట్టాలు అమలు చేసేందుకు కృషి చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పిఎంఎస్‌వైఎం, ఎన్‌పిఎస్ స్కీములను కార్మికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



8 నుంచి ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి -గోపాలపట్నం : సంక్రాంతి సందర్భంగా పశ్చిమ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ సౌజన్యంతో ఈ నెల 8 నుంచి 12వ తేదీ వరకు మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు జివిఎంసి కో-ఆప్షన్ సభ్యులు బెహరా భాస్కరరావు తెలిపారు. స్థానిక కుమారి కళ్యాణ మండపంలో మంగళవారం జివిఎంసి 91, 92 వార్డుల కార్యకర్తల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మన సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు, నియోజకవర్గంలోని అక్కచెల్లెమ్మల్లో ప్రతిభను వెలికి తీయడం కోసం ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 16 నుంచి 25 సంవత్సరాలు, 26 నుంచి 40 సంవత్సరాలు, 41 నుంచి 60 సంవత్సరాల విభాగాలుగా విభజించే పోటీల్లో ఆయా వయసుల వారు పాల్గొనవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో 91, 92 వార్డుల వైసిపి అధ్యక్షులు గునిశెట్టి శ్రీనివాసరావు, జి.అప్పలస్వామినాయుడు, గేదెల మురళీకృష్ణ, పాల్గొన్నారు.

'ఉత్తరం'లో గ్రీవెన్స్

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలో ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు వైసిపి సమన్వయకర్త కెకె.రాజు మంగళవారం పార్టీ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి చెందిన పలువురు వచ్చి సమస్యలతో కూడిన వినతిపత్రాలను కెకె.రాజుకు అందించారు. వినతిపత్రాలను పరిశీలించిన కెకె.రాజు అధికారులతో మాట్లాడి కొన్నింటిని వెంటనే పరిష్కరించారు. మరికొన్నింటింకి సంబంధించి అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి ఒకటో వార్డు పరిధిలో రూ 86.75 లక్షలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మంగళవారం చిట్టివలస ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు ఎ.రాము నాయుడు, జెడ్పీ బొడ్డేపల్లి రాము, ఎఇ సుమన్, జివిఎంసి కో-ఆప్షన్ సభ్యులు కొప్పల ప్రభావతి, మాజీ కౌన్సిలర్లు కొప్పల రమేష్, జివి.రమణ, 1,2 వార్డుల వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ధనుర్మాసోత్సవాలు

ప్రజాశక్తి -యస్ రాయవరం: మండలంలోని కొరుప్రోలులో ధనుర్మాసోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు సీతారామస్వామి ఆలయ ధర్మకర్త యరమాటి సూరిబాబు తెలిపారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సీతారామస్వామి ఆలయంలో ప్రతిఏటా ధనుర్మాసం ప్రారంభం నెల గంట పెట్టినప్పటి నుంచి సంక్రాంతి వరకు ప్రతిరోజూ ప్రత్యేక పూజలు సేవలు నిర్వహిస్తామన్నారు. దాతల సహకారంతో స్వామి, అమ్మవార్లకు పెద్దతిరువీధిసేవ, చిన్న తిరువీధి సేవలతో పాటు ప్రత్యేక పర్వదినాలలో వివిధ అర్చనలు సేవలు చేస్తామని ఆలయ అర్చకులు సుదర్శనం నారాయణాచార్యులు (కుమార్) తెలిపారు.

టిడిపి నేత నానారావు మృతి



నివాళులర్పిస్తున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి -యస్ రాయవరం : మండలంలోని పెనుగొల్లు గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు నానారావు మృతి చెందారు. విషయం తెలుసుకున్న టిడిపి శ్రేణులు మంగళవారం ఉదయం అక్కడికి చేరుకుని, నానారావు మృతదేహంపై తెలుగుదేశం పార్టీ జెండాను కప్పి, ఘన నివాళి అర్పించారు. గ్రామంలో పార్టీ పటిష్టతకు నానరావు చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. నానారావు మృతి పార్టీకి తీరని లోటని మండలశాఖ అధ్యక్షుడు అమలకంటి అబద్ధం అన్నారు. నివాళులు అర్పించిన వారిలో టిడిపి మండలశాఖ మాజీ అధ్యక్షులు ఎన్ వెంకటరాజు, తెలుగుయువత రాష్ట్ర నాయకులు గుర్రం రామకృష్ణ, పల్లెల బుజ్జి, ఎస్‌సి సెల్ నాయకులు ఆశ, తెలుగు యువత మండలపార్టీ అధ్యక్షులు సుంకర శ్రీనివాస్, సీనియర్ నాయకులు ప్రగడ తులసి, గొర్ల దేవుళ్ళు పాల్గొన్నారు.

10,11 తేదీలలో గీతం ఎక్సలెన్స్‌మీట్



వివరాలు వెల్లడిస్తున్న ప్రొఫెసర్ ఫణిపప్పు

ప్రజాశక్తి-మధురవాడ : వాణిజ్య విద్యను అభ్యసించే విద్యార్థులలో నాయకత్వ లక్షణాలతో పాటు క్రీడా, సాంస్కృతిక నైపుణ్యాలను వెలికి తీయడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం బిజినెస్ స్కూల్ రెండు రోజుల పాటు నిర్వహించే గీతం ఎక్స్‌లెన్స్ మీట్ (జెమ్) 2024ను ఈ నెల 10, 11 తేదీలలో నిర్వహించనున్నట్లు బిజినెస్ స్కూల్ డీన్ ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు తెలిపారు. మంగళవారం జెమ్-2024 ఆహ్వానం కమిటీతో కలిసి ఆయన విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. జెమ్ కన్వీనర్, సీనియర్ ప్రొఫెసర్ కె.అశోక్ మాట్లాడుతూ, ఈ ఏడాది కర్తవ్య పేరిట నిర్వహిస్తున్న జెమ్-24 యువజనోత్సవాన్ని "బాధ్యతాయుతమైన సంస్థల నిర్మాణంలో యువజనుల పాత్రను" తెలిపే విధంగా వివిధ వాణిజ్య అంశాలపై వర్క్‌షాప్‌లు, సమకాలీన కార్పోరేట్ రంగం ఎదుర్కొంటున్న సవాళ్ళపై చర్చలతో పాటు స్టార్టప్‌ల ప్రోత్సాహంపై ప్రముఖల ప్రసంగాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పూర్తిగా విద్యార్థులు భాగస్వామ్యులు అయ్యే విధంగా వాణిజ్యరంగంలో విభాగాలు ఏవిధంగా పనిచేస్తాయో అదే విధంగా జెమ్-24 నిర్వహణలో విద్యార్థులు చీఫ్ ఎక్సిక్యూటివ్ ఆఫీసర్, సెక్రటరి, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్, చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్, చీఫ్ ఫైనాన్స్ ఆఫీసర్, క్రియేటివ్ డైరక్టర్, కల్చరల్ డైరక్టర్, స్పోర్ట్సు డైరక్టర్, మీడియా డైరక్టర్ హోదాలో అనుభవ పూర్వకంగా తెలుసుకునేందుకు పనిచేస్తారన్నారు. వాణిజ్య విద్యను అభ్యసించే విద్యార్థులకు నిర్వహణ సామర్థ్యం పెంచడానికి జెమ్-24 వేదికగా ఉపయోగపడు తుందన్నారు.

జెమ్-24 చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఐ.సింధువర్మ మాట్లాడుతూ, యువజనోత్సవంలో భాగంగా విద్యార్థులలో మేనేజ్‌మెంట్ నైపుణ్యాలను వెలికి తీసే విధంగా యంగ్ మేనేజర్, కౌటిల్య, విజ్ఞాన సభ, బ్రాండ్ ట్రక్, స్నపోలీ, ఇగ్నైటర్స్, పాథ్, క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీటితో పాటు క్రికెట్, బ్యాడ్మింటన్, త్రోబాల్, బాస్కెట్‌బాల్, వాలీబాల్, చెస్, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. విజేతలకు నగదు బహుమతులను, సర్టిఫికెట్లను అందజేస్తామన్నారు. విద్యార్థుల ఆధ్వర్యాన ఫ్యాషన్‌షో, రాక్‌బాండ్, సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు.సమావేశంలో జెమ్-24 నిర్వాహక కమిటీ కో-కన్వీనర్ డాక్టర్ జోషఫ్ పాల్, వి.చందన, సభ్యులు పాల్గొన్నారు.

'స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకే జగన్ యత్నం'

ప్రజాశక్తి-సీతమ్మధార : ఆంధ్రుల హక్కుగా ఏర్పాటైన విశాఖ ఉక్కును ప్రయివేటుపరం చేయడానికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సర్వశక్తులూ ఉపయోగిస్తున్నారని జనసేన పీఏసీ సభ్యులు కోన తాతారావు ఆరోపించారు. విశాఖ పౌర గ్రంథాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, విశాఖ స్టీల్‌ప్లాంట్‌లోని బ్లాస్ట్ ఫర్నేస్‌ను జిందాల్ కంపెనీకి అప్పగించారు. జిందాల్‌కు చెందిన జెఎస్ డబ్ల్యు గ్రూపు కడపలో ఉక్కు కర్మాగారం నిర్మిస్తుందంటూ రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. అక్కడ పునాది రాయి కూడా పడని ఆ స్టీల్‌ప్లాంట్ పేరిట జిందాల్ ప్రతినిధులు పదేపదే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని కలుస్తూ విశాఖ స్టీల్ ప్లాంట్ కబ్జా చేయడం ప్రారంభించారు. అందులో భాగంగా అత్యంత కీలకమైన బ్లాస్ట్ ఫర్నేస్ -3ను ముఖ్యమంత్రి సహకారంతో చేజిక్కించుకున్నారు. కార్మికుల నుంచి, విశాఖ వాసుల నుంచి, అన్ని రాజకీయ పార్టీల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతున్నా పట్టించుకోకుండా జిందాల్ ప్రయోజనాల కోసం పాటుపడుతున్నారని ఆరోపించారు. 31 మంది పార్లమెంట్ సభ్యులు ఉన్న వైసిపి విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ విషయంలో కేంద్రానికి ఎటువంటి అభ్యంతరం చెప్పకుండా జిందాల్‌కు కట్టబెట్టే పనిలో బిజీగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గడసాల అప్పారావు, పివిఎస్ఎన్.రాజు, నాగలక్ష్మి చౌదరి, గంధం వెంకటరావు, గొల్ల కోటి సామన్న, లక్ష్మణరావు, భోగిల శ్రీనివాస్ పట్నాయక్, భార్గవ్ పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై అవగాహన



అగాహన కల్పిస్తున్నసిబ్బంది

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని పప్పుశెట్టిపాలెం పంచాయతీలో సర్పంచ్ మాకిరెడ్డి విజయలక్ష్మీ ఆధ్వర్యంలో మంగళవారం ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. దీనికోసం ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ద్వారా ఓటు వేయడంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వైసిపి మండల యూత్ యూత్ అధ్యక్షులు మాకిరెడ్డి రామకృష్ణనాయుడు, వీఆర్వో అప్పారావు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి వ్యాక్సినేషన్



చీడికాడలో పశువులకు వ్యాక్సినేషన్ చేస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - మాడుగుల : జాతీయ పశు వ్యాధి నియంత్రణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం శంకరం పంచాయతీ కొత్తవలస, వీర నారాయణం, చింతలూరు, కేజే పురం, పొంగలిపాక గ్రామాలలో మొత్తం 383 పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను వేసినట్లు పశుసంవర్ధకశాఖ మాడుగుల సహాయ సంచాలకులు డాక్టర్ చిట్టినాయుడు తెలిపారు. ఈనెల 2వ తేదీ నుండి ఫిబ్రవరి ఒకటో తేదీ వరకు నిర్వహిస్తున్న ఉచిత వ్యాక్సినేషన్‌ను పాడిరైతులంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చీడికాడ మండలానికి 16,550 డోసులు, మాడుగుల మండలానికి 16,450 డోసులు వచ్చాయన్నారు.

చీడికాడ : మండలంలోని చీడికాడ, సిరిజం, ఖండివరం, పెదకోగడ గ్రామాల్లో 580 పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశామని పశువైద్యాధికారి డాక్టర్ జి గాయత్రిదేవి తెలిపారు. ఉచిత గాలికుంటు వ్యాధి వ్యాక్సిన్‌కు ఆయా గ్రామాల్లో రైతు భరోసా కేంద్రంలో ఉండే పశు వైద్య సహాయకులను సందర్శించి, ఈనెలాఖరులోగా పాడిపశువులకు వేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పశు వైద్య సహాయకులు కె.అర్జున, ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు

కాంగ్రెస్ పూర్వవైభవానికి కృషి

ప్రజాశక్తి-పెందుర్తి : కాంగ్రెస్ పూర్వ వైభవానికి కార్యకర్తలందరూ ఐక్యంగా కృషి చేయాలని కాంగ్రెస్ నాయకులు వీక్ దివాకర్ అన్నారు. మంగళవారం తన స్వగృహంలో మీడియా సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. సొంతగూటికి రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. షర్మిల కాంగ్రెస్ పగ్గాలు చేపట్టనుండటంతో మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. ప్రతి గ్రామానికి వెళ్లి రానున్న రోజుల్లో కాంగ్రెస్ విజయానికి ఐక్యంగా కృషి చేస్తామన్నారు. కాంగ్రెస్ జిల్లా సెక్రెటరీ విన్నకోట రాము, నాయకులు ఆర్ఆర్ నాయుడు, షఫీ, లక్ష్మణ, ఎం.రామనాయుడు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అధ్యాపక సంఘం రాష్ట్ర కౌన్సిలర్‌గా సింహాద్రప్పడు

ప్రజాశక్తి -భీమునిపట్నం : ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకుల సంఘం రాష్ట్ర కౌన్సిలర్‌గా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల భౌతికశాస్త్ర అధ్యాపకులు బి.సింహాద్రప్పడు ఎన్నికయ్యారు. అర్థశాస్త్ర అధ్యాపకునిగా పని చేస్తున్న కె.సూరిబాబు సహాయ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో తమను ఈ మేరకు ఎన్నుకున్నట్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు

షూటింగ్ బాల్ పోటీల్లో సన్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -భీమునిపట్నం : ప్రకాశం జిల్లా సంతనూతలపాడు మండలం పేర్నమిట్ట జెడ్పీ హైస్కూల్‌లో ఇటీవల జరిగిన 42వ ఎపి సబ్ జూనియర్స్ బాలురు, బాలికల అంతర్ జిల్లా షూటింగ్ బాల్ ఛాంపియన్ షిప్ 2023-24 పోటీల్లో అండర్ -17 విభాగంలో తమ స్కూల్‌కు చెందిన బాలికల జట్టు ద్వితీయ స్థానం, బాలుర జట్టు తృతీయ స్థానం సాధించినట్లు సన్ స్కూల్ కరస్పాండెంట్ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం పాఠశాలలో అభినందన సభ నిర్వహించారు. విద్యార్థుల కృషిని కొనియాడారు

మూడు నెలల తర్వాత ఎపికి మంచిరోజులు

ప్రజాశక్తి-సీతమ్మధార : మూడు నెలల తర్వాత ఎపి ప్రజలకు సుఖ సంతోషాలు వస్తాయని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్ రాజు పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసిపి ఘోరంగా ఓటమి పాలై జగన్మోహన్‌రెడ్డి ఇంటికెళ్లడం ఖాయమని తెలిపారు. వైసిపికి 20 సీట్లు మించిరావంటూ జోస్యం చెప్పారు. రాష్ట్రాన్ని అన్ని విధాలా జగన్మోహన్‌రెడ్డి సర్వనాశనం చేశారని మండిపడ్డారు.

పారిశుధ్యం మెరుగునకు ప్రత్యేక ప్రణాళిక



గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ లోచల సుజాత

ప్రజాశక్తి-గొలుగొండ : పంచాయతీలో పారిశుధ్యం మెరుగుదలకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు ఏఎల్.పురం సర్పంచ్ లోచల సుజాత తెలిపారు. మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం పరిరక్షణలో ప్రజలంతా భాగస్వాములై సహకరించాలని కోరారు. ప్రభుత్వ పథకాలు అర్హులందరికి అందేలా చూడాలన్నారు.కార్యక్రమంలో ఎంపిటిసి చింతల బుల్లిప్రసాద్, సచివాలయ సెక్రటరీ రాజేష్ పాల్గొన్నారు.

పెరిగిన చలి తీవ్రత



దట్టంగా కురుస్తున్న మంచు

ప్రజాశక్తి -కోటవురట్ల: మండల వ్యాప్తంగా గడిచిన కొద్ది రోజులుగా చలి తీవ్రత బాగా పెరిగింది. చలి తీవ్రతతో పాటు దట్టంగా కురుస్తున్న మంచుతో ఉదయం పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, పొలం పనులకు వెళ్లే రైతులు, కూలీలు ప్రయాణికులు ఇలా అన్ని వర్గాల ప్రజల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

దున్నపోతులకు వినతి

తమ సమస్యలపై ప్రభుత్వ మొండివైఖరిని నిరసిస్తూ అంగన్వాడీలకు దున్నపోతులకు వినతిపత్రాలను ఇచ్చారు. ఈనెల 5 నుంచి విధుల్లో చేరాలని నోటీసులు జారీపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వాటిని తిరస్కరించారు. కొన్ని చోట్ల తీసుకున్న నోటీసులను దగ్ధం చేసి నిరసన తెలిపారు. 3న బుధవారం కలెక్టరేట్‌ల ముట్టడి ఆందోళనకు పిలుపునిచ్చారు.

(ప్రజాశక్తి విలేకర్ల యంత్రాంగం)

- ప్రభుత్వ మొండివైఖరిపై అంగన్వాడీల నిరసన
- సమ్మె విరమణకు నోటీసులు జారీపై గరంగరం
- నేడు కలెక్టరేట్ ముట్టడి, దిగ్బంధనానికి పిలుపు
- ఎక్కడికక్కడ ఆందోళనలు



పెందుర్తిలో నోటీసులను దగ్ధంచేస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఈ నెల 5లోగా విధుల్లోకి చేరకపోతే చర్యలు తీసుకుంటామంటూ అధికారులు ఇచ్చిన నోటీసులను విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద అంగన్‌వాడీలు దగ్ధం చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వై.తులసి మాట్లాడుతూ లబ్ధిదారులకు పౌష్టికాహారం గురించి ఆలోచించే ప్రభుత్వం అంగన్వాడీల బతుకుల గురించి ఆలోచించకపోవడం అన్యాయమన్నారు. పెరిగిన ధరలతో పోల్చుకుంటే రూ.11,500 వేతనం ఏమాత్రమూ సరిపోవడం లేదన్నారు. వేతనాలు పెంచే వరకు, గ్రాట్యూటీ ఇచ్చేవరకూ సమ్మె ఆగదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు నాయకులు పి.మణి, వై.తులసి, శోభారాణి, వెంకటలక్ష్మి, పాప వేణి, శాంతి, శ్యామల, రామలక్ష్మి, లక్ష్మి పాల్గొన్నారు

బెదిరింపులు ఆపాలి : సిఐటియు

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడటం దుర్మార్గమని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ ఓ ప్రకటనలో ఖండించారు. జిల్లా కలెక్టర్ల పేరుతో 'అంగన్‌వాడీలు సమ్మెను వెంటనే విరమించి జనవరి 5వ తేదీలోపు విధుల్లోకి చేరకపోతే వారిని ఉద్యోగాల నుండి తొలగిస్తాం' అని సర్క్యులర్స్ జారీ చేయడం తగదన్నారు.

మాడుగుల: అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేస్తున్న అంగన్వాడీలు మంగళవారం 22వ రోజున దున్నపోతుకు వినతిపత్రం అందించారుతమ సమస్యలపై ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం చెప్పకుండా, దున్నపోతు మాదిరిగా మొండివైఖరిని నిరసిస్తూ వినూత్నంగా ఆందోళన చేశారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ మాడుగుల ప్రాజెక్టు అంగన్వాడీ యూనియన్ నాయకులు ఆర్ రామలక్ష్మి, డి పార్వతి, వి ధనలక్ష్మి తెలిపారు. ఆదివాసీ గిరిజన సంఘం నాన్ షెడ్యూల్ ఏరియా జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరట నరసింహమూర్తి సంఘీభావం తెలిపారు.

యస్ రాయవరం : 22రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్వాడీలు మంగళవారం కొరుప్రోలు గ్రామంలో మేత మేస్తున్న దున్నపోతుకు అంగన్వాడీలు, సిఐటియు సభ్యులతో కలసి వినతిపత్రం అందించారు. తమ న్యాయమైన సమస్యలపై ప్రభుత్వం స్పందించడం లేదని, నీవైనా పరిష్కారం చూపాలంటూ వినతిపత్రం అందచేసినట్టు అంగన్వాడీ ప్రాజెక్టు అధ్యకులు యూ లక్ష్మి, సీతరత్నం తెలిపారు. దున్నపోతుకు వినతిపత్రం అందిస్తే ప్రభుత్వానికి సిగ్గయినా వస్తుందన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం సత్యనారాయణ పాల్గొన్నారు.

అంగన్వాడీల సమ్మెకు జనసేన నేతలు సంఘీభావం తెలిపారు. ఆపార్టీ సీనియర్ నాయకులు సేనాపతి బాబూరావు మాస్టారు ఆధ్వర్యంలో పాలపర్తి వెంకటరవి, పులి సత్తిబాబు,ఉమ్మిడి సంజీవరావు,పప్పల శివ, ప్రసాదుల గణేష్, అప్పికొండ బుజ్జి, నక్కాశ్రీనివాసరావు తదితరులు సమ్మె శిబిరంలో అంగన్వాడీలతో కలిసి కూర్చుని, ప్రభుత్వ వైఖరికి నిరసన తెలిపారు.

కోటవురట్ల : నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్వాడీలు, మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంవద్ద సమ్మె శిబిరం వద్ద వినూత్నరీతిలో దున్నపోతుకు తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు, కార్యక్రమంలో పుష్పకుమారి, చెన్నమ్మి, చెన్నాలమ్మ, గంగ, రాజారత్నం పాల్గొన్నారు.

నక్కపల్లి : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు జి సత్యనారాయణ డిమాండ్ చేశారు.మండల పరిషత్ కార్యాలయ వద్ద అంగన్వాడీల సమ్మె శిబిరానికి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం అప్పలరాజుతో వచ్చి అంగన్వాడీల సమ్మెకు సంఘీభావం ప్రకటించారు. విపక్ష నేతగా ఉన్నపుడు హామీ ఇచ్చిన సిఎం జగన్, అధికారంలోకి రాగానే అంగన్వాడీలు కాన రాలేదాయని ప్రశ్నించారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు దుర్గారాణి, ప్రాజెక్టు అధ్యక్షురాలు సుబ్బలక్ష్మి, యూనియన్ నాయకులు కవిత, లక్ష్మీ రాజ్యం, మంగ లక్ష్మీ, రమణమ్మ, జయ, ఆర్‌వికె లక్ష్మీ పాల్గొన్నారు.

చీడికాడ : అంగన్వాడీల నిరవధిక సమ్మెలో భాగంగా మంగళవారం చీడికాడ, తురువోలు గ్రామాల్లో సిఐటియు నేత ఆర్ దేమునాయుడు ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించి, తర్వాత గ్రామ సచివాలయాన్ని ముట్టడించారు. సచివాలయ కార్యాలయానికి తాళం వేసి ఉండడంతో గోడకు వినతిపత్రాన్ని అంటించారు. అంగన్వాడీల సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఈనెల 3న బుధవారం కలెక్టరేట్ వద్ద ధర్నా, ముట్టడి ఆందోళన చేయనున్నట్లు వెల్లడించారు.

రావికమతం : అంగన్వాడీలు చేపట్టిన సమ్మె 22 రోజులు పూర్తయినా ప్రభుత్వంలో ఎటువంటి చలనం లేకపోవడాన్ని నిరసిస్తూ మంగళవారం దున్నపోతులకు వినతి పత్రాన్ని అందజేశారు. అంగన్వాడీలపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు మాని సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి సత్యవేణి కోరారు.

తగరపువలస : తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్లు, సహాయకులు తగరపువలస జంక్షన్‌లో దున్నపోతుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం భీమిలి జోన్ కార్యదర్శి ఆర్‌ఎస్‌ఎన్.మూర్తి మాట్లాడుతూ, గత 22 రోజులుగా అంగన్‌వాడీలు పోరాటం చేస్తున్నప్పటికి ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడం ప్రభుత్వ మొండి వైఖరికి నిదర్శనమన్నారు. ఈ నెల 3వ తేదీన చేపట్టే కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) భీమిలి ప్రాజెక్ట్ గౌరవాధ్యక్షులు కె.వెంకటలక్ష్మి, అధ్యక్ష, కార్యదర్శులు శ్రీదేవి, కొవ్వాడ లక్ష్మి, జిల్లా కోశాధికారి కె.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన సమ్మె మంగళవారానికి 22వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా బర్రెకు వినతి పత్రం అందజేశారు. ఈ నెల 5వ తేదీ లోపు విధుల్లో చేరాలని జారీ చేసిన నోటీసులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.బృందావతి మాట్లాడుతూ, 22 రోజులుగా రోడ్డెక్కి ధర్నాలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భవాని, దేవి తదితరులు పాల్గొన్నారు.

నేటి కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయండి

అనకాపల్లి : రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద బుధవారం జరుగు ముట్టడి కార్యక్రమంలో అంగన్వాడీలందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఎపి అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం దుర్గారాణి, ఎం.నాగ శేషు పిలుపునిచ్చారు. 22 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించ లేదు, సరి కదా బెదిరింపులకు పాల్పడుతోందని, ఇందుకు నిరసనగా ముట్టడి ఆందోళన చేస్తున్నామని చెప్పారు.

మునగపాక : అంగన్వాడీలు 22వ రోజు నిరసనలు వినూత్నంగా చేపట్టారు. అంగన్వాడి కేంద్రాలలో తమ సమస్యలను తెలియజేస్తూ తమ పడుతున్న వేదనను కళ్లకు కట్టినట్లుగా కళా ప్రదర్శనలిచ్చి ఆద్యాంతం పలువురుని ఆకట్టుకున్నారు. తమ సమస్యల పరిష్కరించాలని దున్నపోతుకు తెలుపుతూ వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆళ్లమహేశ్వరరావు, సిఐటియు మండల కన్వీనర్ ఎస్ బ్రహ్మాజీ, అంగన్వాడీలు హేమలత, సరస్వతి, అంజలి, బేబీ కాండ్రేగుల గంగాభవాని, ఉమాదేవి, లక్ష్మి, వెంకట సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

చోడవరం : మండల కేంద్రంలో అంగనవాడీలు దున్నపోతుకు వినతిపత్రం అందించి ప్రభుత్వ తీరును ఎండగట్టారు. తక్షణమే తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్‌వి నాయుడు, యూనియన్ నాయకులు సూర్యకాంతం, కొండమ్మ, కాంతం, జగదీశ్వరి, కృష్ణవేణి, అరుణ, మహాలక్ష్మి పాల్గొన్నారు.



సబ్బవరంలో దున్నపోతుకు వినతిపత్రాలను అందజేస్తున్న అంగన్వాడీలు

సబ్బవరం : అంగన్వాడీలు తమ సమస్యలపై మంగళవారం దున్నపోతుకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఉప్పాడ సత్యవతి, తోపుడు బళ్ల సంఘం నాయకులు మొల్లేటి గౌరీశ్వరరావు, యూనియన్ నాయకులు వి.వి.రమణమ్మ, ఎం. వరలక్ష్మి, పుష్ప, జగదీశ్వరి, వి. సుభాషిణి, ఎం. కనకమ్మ,జి. అరుణ కుమారి,ఎస్. రమణమ్మ, డి. భారతి, ఎ. రమణమ్మ, పి. సూరమ్మ, ఎన్. సత్యవేణి పాల్గొన్నారు.

కె.కోటపాడు : అంగన్వాడీల సమస్యలపై మంగళవారం దున్నపోతుకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి రొంగలి ముత్యాల నాయుడు, యూనియన్ నాయకులు జి కుమారి, భవాని, ఎం లక్ష్మి, జయలక్ష్మి , కెవిపిఎస్ జిల్లా నాయకులు గాడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పరవాడ : అంగన్వాడీలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ మంగళవారం పరవాడ తాసిల్దార్ కార్యాలయం ఎదుట గడ్డి తింటూ, దున్నపోతుకి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సిహెచ్ దేవి, జి అమ్మాజీ, వెంకటలక్ష్మి, పార్వతి, సత్య, నీలిమ, భవాని పాల్గొన్నారు

బుచ్చయ్యపేట : తమ సమస్యల పరిష్కారం కోరుతూ ఆందోళన చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు మంగళవారం దున్నపోతుకు వినతి పత్రం అందజేసి తమ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఆది వరలక్ష్మి, ఎలిసెట్టి అమ్మజి, ఏపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ దుర్గాప్రసాద్, మధు కృష్ణ పాల్గొన్నారు.

అనకాపల్లి : అంగన్వాడీలు అనకాపల్లి నాలుగు రోడ్ల జంక్షన్లో ధర్నా నిర్వహించి అనంతరం దున్నపోతుకి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు తనూజ, కాసులమ్మ, ఉమా నారాయణమ్మ, కృష్ణవేణి, రామలక్ష్మి, సాయి పాల్గొన్నారు.

కలెక్టర్ నోటీసులు దగ్ధం

నక్కపల్లి : లబ్ధిదారుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని సమ్మెను విరమించాలని కోరుతూ మంగళవారం దీక్షాశిబిరం వద్దకు వచ్చి ఐసిడిఎస్ సూపర్‌వైజర్ అందించిన నోటీసులను నోటీసులను అంగన్వాడీలు దగ్ధం చేశారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని స్పష్టం చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని సమ్మె చేస్తుంటే, చర్చలపేరుతో కాలయాపన చేయడమే కాకుండా, సమ్మెను విరమించకుంటే చర్యలు తప్పవని నోటీసులు జారీ చేయడం దుర్మార్గమని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు..ప్రభుత్వ మొండివైఖరిని నిరసిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు .



అనకాపల్లిలో దున్నపోతుకు వినతిపత్రం



జివిఎంసి వద్ద నోటీసులను దగ్ధం చేస్తున్న అంగన్వాడీలు



నక్కపల్లిలో నోటీసులు దగ్ధం



కోటవురట్లలో దున్నపోతుకు వినతిపత్రం అందజేత